# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 38 సంచిక 4

పేజీలు 44

డిసెంబర్ 2018

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

భద్రవాక్యం ........................................4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 6

అమ్మమాట........................................ 8

శ్రీబాబు బృందావన ధామము-
శ్రీ స్వామినారాయణ్
అక్షరధామము ..............................11

శ్రీ మాతాజీ వారి సందేశం ..........................13

ఏసుక్రీస్తు ........................................16

కులం లేని భక్తి ........................................18

శ్రీబాబుజీతో నా చిన్ననాటి
అనుభవాలు .... 19

హైదరాబాద్ శాఖలో కార్యక్రమాలు....21

దీపం వుండగానే యిల్లు
చక్కబెట్టుకోవాలి ......................22

దివ్యాభరణాలు ........................................24

భక్తిలో గల మాధుర్యం ..............................27

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు..........................29

శ్రీకృష్ణ కర్ణామృతము ..............................30

పరిప్రశ్న ........................................ ..32

తితీక్ష ........................................ 35

కైవల్యోపనిషత్ ... ......................................37

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ....... ........................ ...................41

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

## అమృతబిన్దూపనిషద్

3. **యతో నిర్విషయస్యాస్య మనసో ముక్తిరిష్యతే।**
**అతో నిర్విషయం నిత్యమ్ మనః కార్యం ముముక్షుణా ॥**

ముక్తి లేక మోక్షము పొందాలని ఆకాంక్షించే సాధకులెవరైనా మనస్సును నిర్విషయము గావించవలసినదే. అలా చేయటం వారి కర్తవ్యం. నిర్విషయమైన మనస్సుకే ముక్తి అని ఉపనిషత్తు స్పష్టంగా తెలియ జేస్తోంది.

దేహేంద్రియాదులకు ముక్తి లేదు. ఆత్మ వస్తువుకి ముక్తి అవసరం లేదు. అందువలన మోక్షము మనస్సుకే. అయితే మానవులంతా విషయాదులు లేకుండా జీవితం ఎలా గడుస్తుంది? అని ప్రశ్నించని వారు వుండరు. అయితే మానవుడు తినటం, నీరు త్రాగటము, నిదురించటం అనేవి విషయాదులు ఎన్నడూ కాదు. అవి సహజ ప్రక్రియలు. అవి లేకుండా ఈ దేహధారణ చేసిన ఎవరైనా జీవితాన్ని గడపటం అసంభవం కావచ్చు.

అయితే మానవులంతా జీవితమంటే ధనార్జన చేయటం, ఆస్తులు సమకూర్చుకోవటం, వీటితో సంతృప్తి చెందక వ్యసనాలకు బానిసలవటం, భోగభాగ్యాలు, పదవుల కోసం అవసరమైతే కోర్టు చుట్టూ ప్రదక్షిణాలు చేయటం లాంటివి చేస్తూ సుఖదుఃఖాల వలయంలో పడి చిక్కుకుని అదే జీవిత పరమార్థంగా జీవనాన్ని కొనసాగిస్తారు. అటువంటి వారంతా వట్టి చేతులతో మట్టి పాలవక తప్పదు కదా!

అటువంటి మానవుల దుఃఖనివారణకి మహాత్ములెవరైనా సూచనలను ఇచ్చి తరుణోపాయాన్ని సూచించినా, గుర్తించేవారు ఎంతమంది? అయితే తత్త్వ పరంగా పరిశీలిస్తే మానవుడు అటువంటి జీవనం గడపటానికి కారణము తన దోషపూరిత సంస్కారమే అని గ్రహించాలి.

ఇటువంటి స్థితి నుంచి బయటపడాలంటే మనస్సు నిర్విషయ మవ్వక తప్పదు. మనుస్సని నిర్విషయం చేయాలంటే మానవుడు తన

జీవిత పరమార్థం ఏమిటో తెలుసుకోవాలి. అంతేకాదు దోషభూయిష్టమైన జీవనానికి స్వస్తి చెప్పాలి. దోష ప్రవృత్తితో కూడిన జీవనాన్ని గడుపుతూ మనస్సు విషయాదులకు దూరం కావాలని కోరుకోవటం శుద్ధ అవివేకం. అటువంటి మానవుడికి తాను ముముక్షువు కావాలనే ఆకాంక్ష చిత్తశుద్ధితో కూడినది కాదు.

అందువలన మోక్షాన్ని సాధించాలంటే ముందుగా సాధకుడు తన మనస్సుని అనుక్షణం పరిశీలన చేస్తూ నిర్విషయ స్థితిని సాధించటమే తన కర్తవ్యంగా జీవించగలగాలి. దానికి సరియైన సదవగాహన కావాలి. అంతేకాదు కార్యాచరణ కూడా కావాలి. దీనిని సాధించటానికి సద్గురుమూర్తి సమాశ్రయము తోడ్పడుతుంది అనేది గ్రహించిన సాధకుడు ధన్యుడు!

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

**డిసెంబర్ 2018**

02 ఆది - శ్రీ గురు దశమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

16 ఆది - ధనుర్మాస ప్రారంభం. - నెలరోజులు ఉదయం 5గం.లకు శ్రీసద్గురుపాదపూజ; నగరసంకీర్తన. తిరుప్పావై; ముకుందమాల పారాయణ.

18 మంగళ - ముక్కోటి ఏకాదశి

22 శని - పౌర్ణమి - దత్తజయంతి - రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

31 సోమ - శ్రీ గురుదశమి, రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

**జనవరి 2019**

14 సోమ - భోగి -రాత్రి 7గం.లకు శ్రీ సద్గురుపాదపూజ, భోగిపళ్ళు.

15 మంగళ - మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

21 సోమవారం - పుష్య పౌర్ణమి - రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

# శ్రీబాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

18-1-1980

ఈరోజు రాత్రి 9 గం॥లకు శ్రీ బాబూజీ దర్శనం యిచ్చారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో పడిన వ్యాసం వెంకటరత్నంగారు చదివారు. శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'భగవత్ జిజ్ఞాస ఉన్నవారు ఎల్లప్పుడూ పరమాత్ముని గూర్చే ఆలోచిస్తారు. ఆసక్తి చూపుతారు. కాని సామాన్యులకు ఏమి ఆసక్తి ఉంటుంది? ఈ వ్యాసం చదువుతున్నారు. ఎంతమంది దృష్టి దీనిమీద ఉందో, చెప్పగలమా? అది వారి మనస్సుకు తెలుసు, నాకు తెలుసు. భగవత్ జిజ్ఞాస కలిగి ఉండటానికి కులము, మతము, పాండిత్యముతో ప్రమేయం వుండదు.ఒక అగ్రవర్ణానికి చెందిన ఒక పండితుడు వేదములు, ఉపనిషత్తులు, పురాణాలు అన్నీ చదివాడు. భాష్యశాంతులు చేశాడు. ఒకటేమిటి అన్నిప్రయత్నాలు చేసి భగవత్ సాక్షాత్కారము పొందలేక విఫలుడై, విసుగుచెంది చివరకు ఆ సామ్రాజ్య చక్రవర్తిని తన జీవనాధారానికి ఏదైనా వుపాయం చెప్పమని ప్రార్థించటానికి బయలుదేరాడు.



ఆ పండితుని దారిలో వెంకన్న అనే ఒక గొఱ్ఱెల కాపరి కలసికొని నమస్కరించి "స్వామీ! నాకు భగవత్ సాక్షాత్కారం కలగటానికి ఏదన్నా మంత్రం ఉపదేశం చేయండి" అని ప్రార్థించాడు. ఆ పండితుడు దురహంకారి. నేను ఇంత పాండిత్యం గడించాను. అగ్రవర్ణానికి చెందినవాడిని. అయినా నాకే భగవంతుని సాక్షాత్కారం కలగలేదు. అటువంటిది ఈ విద్యాహీనుడికి, తక్కువ కులానికి చెందినవాడికి సాధ్యపడుతుందా? వీడికి మంత్రోపదేశం కావాలా? వీడికి అసలు మంత్రోచ్ఛారణ చేతనవుతుందా? అటువంటి వాడికి మంత్రోపదేశం చేసినట్లయితే మంత్రం అపవిత్రం అయిపోదా? కాబట్టి వీడికి ఒక మాయ మంత్రం ఉపదేశం చేసి వీడిని ఆట పట్టిస్తాను అని అనుకుంటాడు, అజ్ఞానపు పొర కమ్మిన ఆ పండితుడు.

'ఓరీ బాలకా! నీకు భగవత్సాక్షాత్కారం పొందటానికి మంత్రోపదేశం

చేస్తాను. దానిని జపిస్తూ నిత్యము పాయసం చేసి భగవంతునికి అర్పించి నువ్వు సేవించు. తప్పక నీకు సాక్షాత్కారం అవుతుంది. నేను తిరిగి ఈ దారిన వచ్చేటప్పుడు మళ్ళీ కలుసుకుందాం' అని, ఆ గొల్లవెంకన్నకు 'ఓ బొల్లి గద్దపైనున్న నల్లనయ్యా! వైకుంఠవాసా ! రావయ్యా వచ్చి ఈ పాయసం తినవయ్యా' అని పండితుడు మంత్రోపదేశం చేసి దానిని జపించమని చెప్పి వెళ్ళిపోతాడు. చూశారా! ఆ పండితుని సంస్కారం! వక్రబుద్ధి కలవానికి వక్రాలోచనలే కలుగుతాయి. వారి మనస్సు అజ్ఞానమనే ముసుగుతో కప్పబడి ఉంది. అందుచేతనే ఇతరులను చులకనగా చూడటం, అందరినీ వక్రంగా భావించటం వారికి అతి సామాన్యమైన విషయం. కులతత్వం, సంకుచిత భావాలు బాగా నాటుకుపోయాయి.

నా బాల్యంలో అటువంటి పండితులు కొందరు నాతో తరచుగా వాదించేవారు. వారు కులతత్వం పనికిరాదని, దీన్ని సంఘంనుంచి పారద్రోలాలని భగవంతుడిని సేవించటానికి అన్ని వర్గాలవారు అర్హులని, అందరూ కలిసిమెలసి జీవించాలని  పైకి ఉపన్యాసాలు దంచేవారు. కాని పరోక్షంగా నన్ను విమర్శించేవారు. అలా విమర్శించిన వారంతా ఫలితాన్ని అనుభవించారు. ఒకరికి పక్షవాతం వచ్చి కాళ్ళు పడిపోయాయి. మరొకరికి చూపుపోయింది. ఇంకొకరికి పుత్రవియోగం సంభవించింది. విధి బలీయము. మహాత్ములు దూషణలకు, పొగడ్తలకు అతీతులు. వారు దూషించిన వారిని కూడా రక్షించమని భగవంతుడిని ప్రార్థిస్తారు.

కాని గొల్ల వెంకన్న గురువు అటువంటివాడు కాడు. పండితులు గ్రంథాలయాలవంటివారు. పండితులు ఉపన్యాసాలను చక్కని భాషలో యతిప్రాసలు, ఛందస్సులు సరిగా ఉన్నాయా లేవా అని చూసుకొని మాట్లాడవచ్చు. ఆ ఉపన్యాసాలు ప్రజలను ఆకర్షించవచ్చు. కాని వారిదంతా శాస్త్రజ్ఞానం. అనుభవంలేని విద్య. అదే అవిద్య లేక అజ్ఞానము అని పిలవబడుతుంది. సర్వము మాకే తెలుసు అని అనుకుంటారు. అట్టివాడే గొల్ల వెంకన్న గురువు. అట్టి గురువుని ఆశ్రయిస్తే ఏమవుతుంది? అధోగతే. కాని గొల్ల వెంకన్న సంస్కారం గొప్పది. ఆ సంస్కారమే అతన్ని రక్షిస్తుంది. సంస్కార బలము గురువుయందు విశ్వాసం కలిగిస్తుంది. గొల్ల వెంకన్న రోజూ పాయసం చేసి, గురువు చెప్పిన ప్రకారమే వైకుంఠవాసియైన తెల్లగద్దపైనున్న నల్లనయ్యను ఆహ్వానిస్తాడు. దానిలోనే ఏకాగ్రతను సాధిస్తాడు. మనస్సుకు ఏకాగ్రత కుదిరితే ఇంక ఏమి కావాలి?

-సశేషం

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## 'వాసనా క్షయ మయితేనే వాసుదేవ దర్శనం'

మన యొక్క వాసనా క్షయం చేయడానికే మహాత్ములు వస్తున్నారు. వారు చేసే పనులన్నీ కూడా అలాగే వుంటున్నాయి. వాసనా క్షయమయితేగానీ వాసుదేవ దర్శనం అవదు అని శ్రీగురుదేవుల మాట. దాని కోసం ప్రపంచాన్ని విడిచి పెట్టవలసిన పని ఎంతమాత్రం లేదు. వాసన అనేది మనసుకు సంబంధించినది. కనుక వాసనాక్షయమనేది మనస్సులోనే జరగాలి. ప్రపంచంలోనే వుండవచ్చుగానీ వాసన వుండకూడదు.



శ్రీ గురుదేవులు ఎప్పుడూ చెప్పేవారు, 'మీరు ప్రొద్దున్న తిన్న ఇడ్లీ సాంబారు వాసనే మీ చేతిని వదలటం లేదే! మరి జన్మజన్మాంతరాల నుండి మీ చిత్తంలో రికార్డు చేయబడిన వాసనలను నిర్మూలించాలంటే మాటలా?' అని. 'అయినా మీరేమీ భయపడ నవసరం లేదు. ఆ వాసనలు పోవడానికి ఒక చిన్న చిట్కా వుంది. అదే భగవన్నామం, భగవత్తత్త్వ విచారణ. వీటి ద్వారా మీ వాసనలను రహితం చేసుకోవచ్చు' అని ఓదార్చేవారు శ్రీ బాబూజీ మహరాజ్.

అలనాడు భారత యుద్ధం ప్రారంభించే ముందు అర్జునుడు శ్రీకృష్ణ భగవానుని, తన రథం తీసుకువెళ్ళి కౌరవ, పాండవ సేనల మధ్య నిలపమని కోరుతాడు. భగవానుడు అలాగే అర్జునుని రథాన్ని ఇరుసేనల మధ్యలో నిలబెడతాడు. అర్జునుడికి అక్కడ ఎదురుగా వున్న కౌరవ సేనలందరినీ చూపించి, మరీ మరీ వివరించి, 'ఇదిగో! నిన్ను ఎత్తుకుని ఆడించిన మీ తాతగారు భీష్మపితామహుడు ........ నీకు విద్య నేర్పించిన గురువు ద్రోణాచార్యుడు......ఈయనే ......అంటూ పరిచయం చేస్తాడు. ఈ విషయాలన్నీ అర్జునుడికి తెలియవా? తెలుసు. కానీ ఇక్కడ కృష్ణ పరమాత్మ ఒక్క సామాన్య సారథి మాత్రమే కాదు! ఆయన మనలను ఆవరించిన అహంకార, మమకారములనే మహమ్మారి వ్యాధిని

సమూలంగా నాశనం చేసి, మన జీవన రథాన్ని ముక్తిమార్గం వైపుకు తీసుకువెళ్ళే భవరోగ వైద్యుడనే సారథి! మనలో ఎక్కడెక్కడో, హృదయంలో మూలమూలలలో పాతుకు పోయిన బీజాలన్నిటినీ బయటకు లాగాలి కదా! ఆ బీజాలే పిరికితనం, అహంకారం, మమకారం, గుణాలు, వాసనలు - వీటిని సములంగా నాశనం చేయగల సమర్థత జగద్గురుడైన సద్గురుమూర్తికి మాత్రమే వుంది.

తాతగారు తనను ఎత్తుకుని మోశారు, గురువుగారు అన్నీ నేర్పించారు అనే విషయాలన్నీ అర్జునుడికి తెలియదా? తెలుసు. అందుకే వాళ్ళతో నేను పోరాడను అని. వీళ్ళందరినీ వదిలేసి, అడవులకెళ్ళి పోతానంటే గురువులు ఒప్పుకుంటారా? ఎప్పటికీ ఒప్పుకోరు. నువ్వు ప్రపంచంలోనే వుండాలి. కానీ నీలో వాసన వుండకూడదు. అందరినీ ప్రేమించాలి కానీ మమత్వం వుండరాదు.

శ్రీ గురుదేవులకి ఒకసారి ఎవరో భక్తులు హల్వా ఇస్తే, వారు దానిని తీసుకుని సాగదీయటం మొదలుపెట్టారు. అక్కడున్న అందరికీ ఆ ప్రసాదాన్ని అందించారు. ఇది మన ధ్యానానికి ఒక చెదరని ముద్ర. ఇది వాసన కాదు. హల్వా ప్రసాదం పెట్టిన 'స్వామి ప్రేమ' మనకు 'ముద్ర'. అదే మాతృప్రేమ. తల్లి ప్రేమ ఆహారం వేళకి అందించడమే కాదు, తన బిడ్డ విసర్జించే మలమూత్రాదులను కూడా లెక్కచేయక, పెంచిన ప్రేమ. మరి సమస్త విశ్వానికి తల్లీ, తండ్రీ తానే అయిన గురుమూర్తి (భగవంతుడి) ప్రేమను ఎవరు కొలవగలరు? అందుకనే వారు మరచిననూ మరపురారు.

అటువంటి దివ్యప్రేమతో భగవానుడు అర్జునుడికి కళ్ళను కప్పివేసిన మమకార పొరకు చికిత్స చేశాడు. అర్జునుణ్ణి ఒక పాత్రగా (ఒక గోవత్సంగా) తీసుకుని, సమస్త ఉపనిషత్తుల సారాన్నీ, భగవద్గీతామృత వర్షమనే పాలని పిండి లోకానికి వర్షించాడు. ఇది అర్జునుడి ఒక్కడికోసమేనా ఆయన చేశాడు? కాదు, కాదు. సమస్త మానవాళినీ ఉద్ధరించడానికి, వర్షించాడు. అయితే కేవలం తరించాలనే తలంపు గలిగిన మంచి బుద్ధి గలిగిన, ఆత్మబుద్ధిగలిగిన వారందరూ కూడా యీ భగవద్గీతామృతాన్ని గ్రోలడానికి అర్హులే! ఇక్కడ అర్జునుడిని ఆవరించిన, 'నేను, నా వాళ్ళు' అనే భావనని సమూలంగా నాశనం

చేయడానికే భగవంతుడు అంతగా చెప్పవలసి వచ్చింది. వాళ్ళందరూ నీ తండ్రులు, తాతలు, విద్యా గురువులు, చుట్టాలు అయినా వారందరూ అధర్మాన్ని ఆమోదిస్తున్నారు. కనుక అధర్మాన్ని ఎదిరించి, ధర్మాన్ని నిలబెట్టటం క్షత్రియ ధర్మం. ఇక్కడ నా వాళ్ళు అనేది లేదు. అధర్మ పక్షాన్ని ఆశ్రయించిన వారెవరైనా సరే శత్రువులే! అని క్షాత్ర ధర్మాన్ని వివరించి, అర్జునుడిని కర్తవ్యోన్ముఖుని చేశాడు భగవంతుడు.

-సశేషం

## శ్రీ మాతాజీ వారి ఆశ్రమేతర సత్సంగ కార్యక్రమాలు

### డిసెంబర్ 2018 లో

05 - పావులూరులో శ్రీ అవధూతేంద్ర స్వామి నిలయంలో జరిగే ఏకాహంలో పాల్గొంటారు.

19 - కొత్తపాలెం - గాయత్రీ శక్తి పీఠం- సాయంత్రం 4గంలనుండి 6 గం.లవరకు జరిగే సత్సంగంలో శ్రీ మాతాజీ వారి అభిభాషణ.

22 - రాజమండ్రి శ్రీ మళయాళ స్వామి సద్గురు సాంప్రదాయం వారు నిర్వహించే 'సత్రయాగంలో పాల్గొంటారు.

24 - తె.జా 4గం.16నిలకు (తెల్లవారితే 25న) భీమవరంలో పాలూరి శ్రీరామారావు గారి గృహ ప్రవేశం ; శ్రీ సద్గురు పాదపూజ శ్రీమాతాజీ వారి అధ్వర్యంలో జరుగుతాయి.

27 -చిట్యాల - శ్రీ పరమాత్మానందగిరి స్వామి ఉదయం 8 గం.లకు నిర్వహించే మహాత్ముల సభలో పాల్గొంటారు.

### జనవరి 2019లో

.23.01 2019 గుండుగొలనులో జరిగే శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలలో పాల్గొంటారు.

విశాఖపట్టణంలో జరిగే శ్రీ దేవానందస్వామి వారి కార్యక్రమాలలో పాల్గొంటారు.

హైదరాబాద్ ఆశ్రమ బ్రాంచ్‌లో జనవరి 26నుండి 30వ తేదీ వరకు జరిగే ఐదు రోజుల సత్సంగ సమావేశాలలో పాల్గొంటారు.



# శ్రీ బాబు బృందావన ధామము - శ్రీ స్వామి నారాయణ్ అక్షర ధామము



(గత సంచిక తరువాయి)

శ్రీబాబూజీ మహరాజ్ వారు

పరమాత్ముడే అవతారం ధరించి వచ్చినప్పుడు వారికి కూడా సాధన అవసరమా? అవసరమే! కాని అది వారి స్వప్రయోజనానికి కాదు. వారు సిద్ధపురుషులయ్యే ఉన్నారు. కాని వారు సాధనలు, పూజలు, ధ్యానాలు సాధకులకు మార్గనిర్దేశ్యం చేయుటం కోసం చేస్తుంటారు.

శ్రీ బాబు బాల్యంలోనే మాతా పితరులకు దూరమై, ఇల్లు విడచి, ఆద్యంత రహితమైన సత్య వస్తువును అన్వేషించాలనే ఆవేదనతో, దేశ పర్యటనకు బయల్దేరారు. శ్రీకాళీమాత. శ్రీ వీరహనుమానుల దివ్యమూర్తులతో కూడిన దేవతార్చన పేటికను ఒక సంచిలో ఉంచుకొని, ఆసేతు హిమాచల పర్యంతము పర్యటించారు. యావద్భారత దేశంలోని ప్రసిద్ధ క్షేత్రాలనే గాక, నిగూఢమైన ఎన్నో పవిత్ర ప్రదేశాలను శ్రీబాబు సందర్శించారు. ప్రతి పవిత్ర స్థలంలోను శ్రీబాబు కఠోర నిష్ఠలతో తపస్సు చేశారు. ఆ యా క్షేత్ర మూర్తులను ప్రత్యక్షం చేసుకోవటమే గాక, తమ యందు ఆ మూర్తులు అణువ్యాప్తమై వున్నట్లు అనుభూతి పొందేవారు.



హిమాలయాలలోను, శ్రీశైలంలోను, పాపికొండలలోను సుదీర్ఘ తపశ్చర్యను కొనసాగించి, సత్య శోధనలో కృతకృత్యులై, పరమాత్మను సగుణంగా దర్శింటమేగాక, సగుణ నిర్గుణాతీతమైనది కేవలం 'తానే' అయిన స్థితిలో శాశ్వతంగా నిలిచిపోవాలని, హిమాలయ ప్రాంతంలోనే తన అవతార కాలాన్ని గడిపివేయాలనీ అనుకొన్నారు.

కాని తన దేశ పర్యటనలో విధి వంచితులై, అగ్రకులాలవారి

దమననీతికి గురియై ఆక్రోశిస్తున్న ప్రజల ఆక్రందనలు శ్రీబాబు దయార్ద్ర హృదయాన్ని తీవ్రంగా కలచి వేశాయి. అపార ప్రేమ స్వరూపిణి అయిన జగన్మాత తన సంతానంలో జరిగే అన్యాయాన్ని సహించగలదా? కనుకనే శ్రీబాబు రూపంలో మానవాళి మధ్య అవతరించింది. అస్పృశ్యత, అసమానతలను తొలగించుకొని సర్వ జీవులు సమభావంతో ప్రేమదృష్టితో మెలగమని బోధించింది. సమ సమాజ వ్యవస్థను నెలకొల్పింది.

శ్రీబాబు బాల్యం నుండి శ్రీరామతారక మంత్రోపాసన చేశారు. శ్రీరామ చంద్రుని ఎన్నో సార్లు దర్శించారు. హనుమద్దర్శనాన్ని పొందారు. శ్రీరామతత్త్వము, శ్రీకృష్ణతత్త్వము, అనంత శక్తి స్వరూపిణి అయిన జగన్మాతతత్త్వము ప్రస్తావనకు వచ్చినప్పుడల్లా శ్రీబాబు అత్యంత పరవశులై ప్రసంగించేవారు.

సాధనకాలంలో కఠిన దీక్షలు అవలంబించి, ఆహార నిద్రాదికములలో ఎన్నో నియమాలను పాటించేవారు. ఎక్కువగా వంగపండు రంగు పట్టుబట్టలు ధరించేవారు. ఒకే పంచెతో ఎన్నో రోజులు కాలక్షేపం చేసేవారు. రోజుకు ఒకసారి అయిదు ముద్దలుఆహారం స్వీకరించేవారు. కొంతకాలం ఒకేముద్ద తీసికొనేవారు. లేదా గుప్పెడు శనగలో, అటుకులో నానవేసుకుని తీసుకొనేవారు. కేవలం మంచినీరు తీసుకున్న రోజులు చాలా ఉన్నాయి. అరుగులపైననో, గోదావరి ఇసుక తిన్నెలపైననో పవళించి ఆత్మ విచారణ అనే అమృతాన్ని పానం చేస్తూ పవళించేవారు.

నీలమేఘ ఛాయతో, సన్నగా చురుకుగా ఉన్నదేహంతో, తీక్షణములైన, తేజోవంతములైన కన్నులతో, ముక్కుకు కాడతో, కాలికి తోడాతో, నీలిరంగు పట్టుబట్టలు ధరించి వస్తుంటే వారిని 'సాధువు' గారు అనేవారు. ఎవ్వరూ ఆయన కళ్లలో సూటిగా చూడగలిగేవారు కాదు. కాని స్వామివారి పలుకులలో మాత్రం ప్రేమ, కరుణ తొణికిసలాడుతుండేవి. శ్రీబాబు వారితో ఎంతో ఆదరంతో వినయంతో, ఆప్యాయతతో సంభాషించేవారు.

-సశేషం

# శ్రీ మాతాజీ వారి సందేశం

- రమణ ప్రసాద్

**(దసరాలలో 21-10-2018 న శ్రీసద్గురుపాదపూజ సందర్భంగా)**

శ్రీ గురుదేవులు మనందరికీ ప్రసాదించిన శరన్నవరాత్రి వుత్సవాలలో అమ్మ చల్లని ఒడిలో, శ్రీ గురుదేవులే మన తల్లి, తండ్రి, గురువు, దైవమై జరిపించుకొన్న ఉత్సవాలలో భక్తులు పొందిన ఆనందం చెప్పనలవికాదు. ఎందుకంటే అది అనుభవైకవేద్యం కనుక. ఆ అనుగ్రహం కంటికి కనిపించేది కాదు. బ్యాటరీలో శక్తి బయటకు కనిపిస్తుందా? కాని అది బ్యాటరీ లైట్ అనే ఇనుస్ట్రుమెంట్ లో పెట్టి స్విచ్ వేస్తే వెల్తురు ఇచ్చి మన గమ్యస్థానం చేరేవరకు మనకు దారి చూపిస్తుంది. అలాగే మనం ఈ ఉత్సవాలలో అమ్మ అనుగ్రహాన్ని పుష్కళంగా పొంది ఉన్నాం. అమ్మ



ఒక శక్తి-'యూనివర్సల్ పవర్'- జగన్మాత రూపంలో మనందరినీ కరుణించింది. మనందరి వుపాధులలో నెలకొని ఉన్నది ఆ శక్తే. అహంకార మమకారాలను తొలగించుకొంటే మనం అట్టి ఆధ్యాత్మికానుభవాన్ని పొందగలుగుతాం.

గాఢమైన నమ్మకమే విశ్వాసం. చెదరని విశ్వాసమే భక్తి. భక్తితో మనం ఏదైనా సాధించవచ్చు. అటువంటి భక్తి ఎక్కడ లభిస్తుంది? మనం ఆరాధించే దైవం పైన ఏకాగ్రత కలిగితే లభిస్తుంది. ఎక్కువ పూలతో పూజ చేస్తే అది భక్తి అనిపించుకోదు. ఒక పుష్పం మనం భక్తితో అర్పిస్తే, ఎంత భక్తి! తనువు మరచి చేసే ధ్యానం, ఎంత భక్తి! ఎవరైతే పూజ చేస్తూ తమని తాము మరచి పోతారో ఎంత భక్తి! మనం అర్చించుకొనే భగవంతునిలో, ఆ భగవంతుని దివ్య దర్శనంలో, ఆ స్పర్శలో భగవతత్వాన్ని మనం జుట్టుకోవాలి. శ్రీ గురు దేవులు ఎక్కడెక్కడనుండీ భక్తులను రప్పించుకొని అట్టి దివ్యానుభవాన్ని భక్తులందరికీ ప్రసాదించారు. ఎవరైతే తనువును మరచి ఈ కార్యక్రమాలలో, సేవలలో పాల్గొంటారో, వారి సమయం నిత్యకాలంలో జమవుతుందన్నది శ్రీ గురుదేవుల మాట.

మన గురు సోదరులు జగన్మాతకు పూజ చేసిన కుంకుమాక్షతల మహిమను గురించి తెలియజేశారు కదా! శ్రీ గురుదేవులు హార్ట్ ఆపరేషన్ కొరకు అమెరికాకు నన్ను తీసుకువెళ్లారు. ఆపరేషన్

అయ్యేముందు నేను ఈ అక్షతలను, కుంకుమను వారి నుదుట వుంచి,"స్వామీ! ఈ చికత్సనుండి బయటకు వచ్చి మీ అనుగ్రహ వీక్షణంతో మాకు దర్శనం ఇవ్వండి" అని ప్రార్థించాను. స్వామివారు అక్షతలను వేయించుకొన్నారు. అక్కడ పని చేసేది మన గాఢమైన విశ్వాసం. వారు తమ జీవితాన్ని మనకు త్యాగం చేసినప్పుడు మన విశ్వాసం మనం చాటుకోవాలికదా! స్వామి ప్రసాదించిన అక్షతలు స్వామివారి రూపం కూడా. స్వామికి భిన్నంగా ఏదీ లేదు.

అయితే మన విశ్వాసంలో లోపం రాకుండా జాగ్రత్త వహించాలి. నాగార్జున సాగర్ డ్యామ్‌కి వెంట్రుకవాసి బీట వస్తే ఏమవుతుంది? నీటి ప్రవాహానికి ఆ బీట పెద్దదై గ్రామాలను ముంచేస్తుంది. మన విశ్వాసం చెదరకుండా చూసుకోవాలి అంటే, మనం గురుబోధా శ్రవణానికి ఎన్నటికీ దూరం కాకూడదు.

ఇప్పుడు అమ్మ ఆరాధనలు చేసికొన్నాం. అమ్మ చల్లని ఒడిలో హాయిని అనుభవించాం. నవంబర్ 26 నండి డిసెంబర్ 3వ తేదీవరకు తత్త్వ స్వరూపులైన శ్రీ గురుదేవుల ఆరాధనోత్సవాలు వస్తున్నాయి. ఆ వుత్సవాలకు అందరినీ ఆహ్వానిస్తున్నాను. వారికి మనం చేసే పూజల ద్వారా, సంకీర్తన ద్వారా, సేవల ద్వారా శ్రీ గురుదేవుల పరమమైన అనుగ్రహానికి పాత్రులమవుదాం.

ఎప్పటికప్పుడు జీవిత పరమార్థాన్ని గుర్తిస్తూ, ప్రపంచంలోని ఆకర్షణలకు లొంగకుండా చేసికొనే శ్రీ గురుదేవుల ఆరాధనోత్సవాలలో, మహాత్ములు అందించే తత్త్వామృతంలో ఎంత ఆనందం లభిస్తుందో మాటలలో వర్ణించగలమా? ఇది అందరిది అయిన 'యూనివర్సల్ ప్లేస్'. అందరూ శ్రీ గురుదేవుల అనుగ్రహానికి పాత్రులమై వారి అనంత తత్త్వాన్ని గుండెలనిండా నింపుకొని మీ మీ స్థానాలకు చేరుకొని ఇక్కడ ఆకళించుకొన్న తత్త్వాన్ని, మీ స్నేహితులకీ, బంధువులకు చెప్పి అందరిలో భక్తిని పెంపొందింపజేయండి. సత్య వస్తువును గుర్తించండి. ప్రపంచం అసత్యం. ప్రపంచానికి శక్తిని ఇచ్చి ప్రకాశింపజేసేది సత్య వస్తువు. అదే మనలో ప్రకాశిస్తూ, మనందరినీ నడిపిస్తోంది.

అందరం సాధనా మార్గంలో ఉన్నాం. తప్పకుండా పైకి ఎగబ్రాకుతాం. శ్రీ గురుదేవుల అనంతమైన ఆత్మ తత్త్వానికి మనమందరం వారసులం. శ్రీ గురు దేవులు అట్టి శక్తిని, భక్తిని మనందరికీ ప్రసాదించెదరు గాక ! సుభీభవ!

శుభాభినందనలతో ...



INDIGENEOUS anadig MAKE
CAKT-02, CAKT-05, CAKT-06 & TAK-011-03
ENGINE ROOM INSTRUMENTATION FOR EKM SUBMARINE
INDIGENOUS INSTRUMENTS FITTED ON
• INS SINDHUKESRI
• INS SINDHUGHOSH
• INS SINDHUSHSTRA
• INS SINDHURAJ
• INS SINDHUKIRTI
• INS SINDHUVIR
• INS SINDHUVIJAY
anadig systems

# ఏసుక్రీస్తు

- మురళి

క్రీస్తు ప్రసవ సమయంలో తల్లికి ఏ వసతి లభించలేదు. చివరికి ఒక పశువుల శాలలో క్రీస్తు జననం సంభవించింది. ఆయన జన్మించినప్పుడు ఆయనను దర్శించడానికి, తూర్పుదేశపు జ్ఞానులు వెళ్ళారు. వారికి ఒక కాంతివంతమైన నక్షత్రం మార్గదర్శకత్వం చేసింది. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని ముందుగా కొంతమంది గొఱ్ఱె కాపరులు తెలుసుకుంటారు. వారు క్రీస్తును ఆశ్రయించాలని 'తండ్రీ! నీ నివాసమెక్కడ?' అని ప్రశ్నించారు. దానికి బదులుగా క్రీస్తు 'తలదాచుకునేందుకు నాకే స్థలమూ లేదు. అలాగే నన్ను అనుసరించేవారు తమ సర్వస్వాన్ని త్యజించాలి' అని బదులిచ్చాడు. ఎందరెందరో వికలాంగులను అక్కున చేర్చుకుని, వారిలో



పునర్జీవనం నింపాడు క్రీస్తు. క్రీస్తు తండ్రి ఒక పేద వడ్రంగి. ఆ కాలంలో కుష్ఠురోగులను ఊరికి దూరంగా ఉంచేవారు. క్రీస్తు వారిని స్పృశించి, వారికి ఊరట కలిగించేవాడు.

క్రీస్తు ప్రభువు తన బోధనలు ప్రజా సమూహాలకు వినిపించే సమయంలో ఆనాటి మత పెద్దలు వారిని శోధిస్తుండేవారు. ఆ క్రమంలో పాపం చేస్తూ పట్టుబడిన ఓ విధివంచితను ఆయన ముందు నిలబెట్టారు. నాటి ధర్మశాస్త్ర ప్రకారం పాపం చేసిన వాళ్ళను రాళ్ళతో కొట్టి చంపేవారు. క్రీస్తు ముందు ఆ స్త్రీని నిలబెట్టి, ఆయన ఏం చెబుతాడా అని ఎదురు చూస్తున్నారు. అప్పుడు ఏసు ప్రభువు మాట్లాడుతూ 'మీలో పాపం చేయనివారెవరో వారే ఈమెను శిక్షించండి' అన్నారు. ఆ మాటతో అక్కడ ఉన్నవారంతా మౌనం వహించారు. వారి చేతుల్లో వున్న రాళ్ళు క్రింద పడ్డాయి. అందరూ వెను తిరిగారు. అనంతరం ఆ స్త్రీని ఊరడిస్తూ

"పాపం చేయకూడదు తల్లీ! నీకు శిక్ష లేదు. క్షమాపణ దక్కింది" అన్నారు క్రీస్తు. ఈ సంఘటనతో ప్రభువులోని క్షమ లోకానికి మరోసారి తెలిసింది.

క్రీస్తు ఒకసారి యూదయ ప్రాంతం నుంచి గలీలియ వెడుతూ మధ్యలో సమరయ ప్రాంతంలో ఆగారు. యూదులు సమరయులను ద్వేషిస్తారు. సమరయులు ఉపయోగించే వస్తువులను ముట్టుకునేవారు కాదు. వారిని అంటరానివారుగా భావించేవారు. అయితే గలీలియా చేరుకోవాలంటే సమరయ మీదుగానే వెళ్ళాలి. అయినా, యూదులు వేరే మార్గంలో వెళ్ళేవారు. దూరాభారమైనా సమరయకు వచ్చేవారు కాదు. అటువంటి పరిస్థితులలో క్రీస్తు సమరయను దర్శించారు. ఆ మార్గంలో ఒక బావి దగ్గర ఒక స్త్రీని చూసి 'దాహంగా వుంది నీళ్ళు ఇవ్వమని' అడిగారు క్రీస్తు. ఆయన మాటలకు ఆ స్త్రీ ఆశ్చర్యపోయింది. క్రీస్తు ధరించిన దుస్తులు, మేనిచ్ఛాయ చూసి ఆయన యూదుడని గ్రహించిందామె. విస్మయంతో 'నీవు యూదుడవు. సమరయురాలైన నన్ను నీళ్ళు అడుగుతున్నావా?' అని ప్రశ్నించింది. క్రీస్తు చిరునవ్వుతో ఆమె నుండి నీటిని స్వీకరించారు. ఈ సంఘటన చారిత్రాత్మకం. వెలివేసిన దీన జనులతో ప్రభువు మమేకం అవ్వడం సమాజానికి క్రొత్త మార్గాన్ని నిర్దేశించింది. నిరాదరణకు గురైన ప్రజల అభ్యున్నతికి నాంది పలికారు. సమాజంలోని అంటరానితనమనే రుగ్మతను రూపుమాపారు.

క్రీస్తు ఆజ్ఞలు - "పూర్ణ హృదయం, పరిపూర్ణ ఆత్మ, సంపూర్ణ బలంతో నీ తండ్రి అయిన దేవుణ్ణి ప్రేమించాలి; నీలాగే నీ పొరుగువారిని ప్రేమించు. ఈ రెండు ఆజ్ఞలు ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి. ఇవి విడదీయలేనివి, విడదీసేందుకు వీలుకానివి. మీరందరూ నన్ను ప్రేమించినట్లే ఒకరినొకరు పవిత్రంగా, ప్రేమభరితంగా, పరిమళించిన హృదయాన్ని సమర్పించండి" - ఇదే క్రిస్మస్ పర్వదినాన క్రీస్తు ప్రభువుకు మనం ఇవ్వగలిగే బహుమతి!

# కులం లేని భక్తి

- అఖిల

పూర్వం కాశీలో ఒక మహాభక్తుడు ఉండేవాడు. అతడు అంటరానివారని పరిగణించబడే 'మహర్' కులానికి చెందినవాడు. అతడు మహాభక్తుడు కాబట్టి అతని కులాన్ని ఎవరూ పట్టించుకునేవారు కాదు. రాజులు, మహారాజులు, ధనికులు, పేదలు అందరూ అతని మహిమలను తెలిసికొని కొనియాడుతుండేవారు.

అతడు రోజూ ఉదయాన్నే గంగానదిలో స్నానంచేసి, పూజచేసి, తీర్థప్రసాదాలను తన దగ్గరకు వచ్చేవారికి పంచి పెట్టేవాడు.

ఒక రోజు ఒక అహంకారియైన పెద్ద వ్యాపారస్థుడు అతని భక్తి ఏపాటిదో పరీక్షించదలచి, అక్కడకు వచ్చాడు. పూజ ముగిసిన తరువాత ఆ భక్తుడు రోజూలాగానే అక్కడున్నవారందరికీ తీర్థం ఇచ్చాడు. వ్యాపారి అయిష్టంగానే తీసుకున్నాడు. ఇంతలో ఆ వ్యాపారికి ఆ భక్తుడి కులం జ్ఞాపకం వచ్చి, దేహాభిమానం అడ్డువచ్చి, ఎవరూ చూడకుండా ఆ తీర్థాన్ని నోటిలోకి పుచ్చుకోకుండా బయట పారబోశాడు. కొన్ని చుక్కలు అతని దుస్తుల మీద పడ్డాయి. అతనికి వళ్లంతా కంపరమెత్తినట్లయింది.

ఇంటికి వెళ్లగానే ఆ దుస్తులను విప్పి ఒక పాకీవానికిచ్చేశాడు. అవి ధరించగానే ఆ పాకీవాడికి ఎక్కడలేని తేజస్సు వచ్చేసింది. ఈ వ్యాపారికి తేజస్సు క్రమంగా క్షీణించింది. పైగా చర్మరోగం కూడా సంక్రమించింది. ఎంత వైద్యం చేయించినా రోగం తగ్గలేదు.

ఆ వ్యాపారి పూర్వచర్యను అతని బంధువులు తెలుసుకుని, ప్రాయశ్చిత్తంగా ఆ భక్తుని దగ్గరకు వెళ్ళి క్షమాపణ కోరుకోమని పదేపదే హితవు చెప్పారు. అయిష్టంగానే ఆ వ్యాపారి ఆ భక్తుని దగ్గరకు వెళ్ళి నమస్కారంచేసి క్షమాపణ కోరాడు.

ఆ భక్తుడు ఆ వ్యాపారిని ఆప్యాయంగా కౌగలించుకుని, 'అయ్యా! దేవుని దృష్టిలో అందరూ సమానులే! భక్తికి కులంతో పనిలేదు' అని బోధించాడు. ఆ పరమభక్తుని ఆలింగన స్పర్శతో ఆ వ్యాపారికి చర్మరోగం మాయమైంది. ఆ మహాభక్తుడే రైదాసు! భక్తమీరాబాయికి గురువు!!

# శ్రీ బాబుజీతో నా చిన్ననాటి అనుభవాలు

- రమణ ప్రసాద్

1986 ప్రాంతంలో శ్రీబాబు భక్తులైన శ్రీ చరణదాసుగారు సికిందరాబాదు పికెట్‌లో ఉంటున్న నా నివాసానికి వచ్చి, "బాబుగారితో మీరు దిగిన స్కూలు క్లాస్ 'గ్రూప్ ఫోటో ' ఒకటి చూపించండి" అన్నారు. నాకు వెంటనే ఏమి చెప్పాలో అర్థం కాలేదు.

అంతక్రితమే జరిగిన శరన్నవరాత్రి మహోత్సవాలలో శ్రీబాబు నా ప్రస్తావన తీసుకొచ్చి, నన్ను సభలో నుంచోబెట్టి," వీడు నా క్లాస్‌మేట్ అండీ. మేమిద్దరం కలిసి చదువుకున్నాము. నాకేమో అక్షరం ముక్క రాలేదు. వీడేమో పెద్ద చదువులు చదివి నెలకు వేలకు వేలు జీతం సంపాదిస్తున్నాడు. ఏరా క్లాస్ మేటూ! నిజమేనా?" అని పలకించారు. అప్పుడు నేను లేచి నిలబడి నమస్కరించి," ఈనాడు నేనూ, నా కుటుంబమూ ఇలా ఉన్నామంటే అదంతా మీ పరమానుగ్రహమే బాబూ!" అన్నాను. "నిజంగా ఆ విశ్వాసమే నీకుంటే నీకు ఇంక ఢోకా లేదు రా!" అన్నారు శ్రీబాబు. అది విన్న శ్రీ చరణదాస్‌గారు ఆ తరువాత మా ఇంటికి వచ్చి ఆ విధంగా ప్రశ్నించటం జరిగింది.

అసలు విషయం ఏమిటంటే : శ్రీబాబు "నాన్నగారు" అని ప్రేమగా పిలుచుకొనే శ్రీ కందర్ప పరశురామయ్యగారు మా తాతయ్యగారు. వారు 'పోలీసు మేనేజర్'గా చేసి భీమవరం దగ్గర ఉన్న యనమదుర్రు గ్రామంలో వుండేవారు. మా తండ్రిగారైన శ్రీ చల్లా కృష్ణమూర్తిగారు ఉద్యోగరీత్యా మదరాసు(చెన్నై)లో ఉంటూ ఆరోగ్యరీత్యా ఉద్యోగానికి రాజీనామా చేసి యనమదుర్రు వచ్చారు. అప్పుడు నాకు ఐదేళ్ల వయస్సు. ఎప్పుడూ తాతయ్యగారి వద్దనే వుండేవాడిని. ఆయన నాకు చదువు నేర్పటంకోసం కొన్ని



పుస్తకాలు ఉత్తరీయంలో కట్టి భుజంపైన వేసుకొని, 'మనం షికారు వెళ్దాం' అని వుదయాన్నే వారి పొలం దగ్గరికి తీసుకువెళ్లి నాకు పాఠాలు చెప్పేవారు. ఊరి చివర వున్న శ్రీ శక్తీశ్వరాలయం దాటితే చర్చ్ వస్తుంది. అది దాటి కొంతదూరం వెళ్తే ఒక పుంత వస్తుంది. పుంత దాటి కొద్ది దూరం నడిస్తే మా పొలం వస్తుంది. అక్కడ నాకు పాఠాలు నేర్పవారు. ఇది మా దిన చర్య. ఈ విధంగా నేను స్కూలుకి వెళ్లకుండా మా తాతయ్యగారు నాకు ఆరవ తరగతి వరకు చదువు నేర్పించారు. అప్పుడప్పుడు శ్రీబాబు మా ఇంటికి వచ్చి నేను మా తాతయ్యగారి వద్ద పాఠాలు నేర్చుకోవటం చూసి ఆనందించేవారు. మా తాతగారు పరమపదించిన తరువాత నేను భీమవరంలో ఏడవ తరగతిలో హైస్కూల్‌లో చేరటం జరిగింది.

శ్రీ పరశురామయ్యగారు, శ్రీబాబు ఇల్లగీషు నేర్చుకుని ఖండ ఖండాతరాలలో మానవాళికి ఆధ్యాత్మిక తత్త్వాన్ని అందించాలనే ఆకాంక్షతో శ్రీబాబుని ఇంగ్లీషు నేర్చుకోమన్నారు. శ్రీబాబు కూడా దానికి అంగీకరించి పలక ఒడిలో పెట్టుకొని, బలపం చేతిలో పట్టుకొని అలా ఉండిపోయారు! "ఏమిటి బాబూ?" అని అడిగేసరికి, శ్రీబాబు నాన్నగారూ! జగన్మాత ఇదిగో ! ఈ అక్షరాలలో దర్శనం ఇస్తున్నది. నేను బలపం పలకమీద పెట్టబోయేసరికి అమ్మ మందహాస వదనంతో పలకంతా నిండిపోయి కనిపించింది. ఆమె ముఖం పైన బలపం ఎలా పెట్టను? నేను చెయ్యి వెనక్కి తీసుకొనేసరికి, అమ్మ పక పకా నవ్వుతూ," సకల విద్యాధికారిణిని నేనుండగా నీకీ పలకా బలపంతో పనేమున్నదిరా" అన్నది. శ్రీపరశు రామయ్యగారు ఆనంద భాష్పాలతో శ్రీబాబును వాటేసుకుని,"నిజమే బాబూ! అక్షర స్వరూపిణిని నీలో నింపుకున్న నీకు అక్షరాలు నేర్పటానికి ప్రయత్నించటం నా అవివేకం అని శ్రీబాబును ముద్దులతో నింపేశారు. అందుకనే శ్రీబాబు సరదాగా నన్ను "నా క్లాస్‌మేట్" అనేవారు. ఇదంతా మీరు శ్రీబాబు మాటలలో విన్నారు కదా! ఆ కారణం చేత మాకు గ్రూప్ ఫోటో లేదని శ్రీ చరణదాసుగారికి చెప్పాను. శ్రీ బాబుగారు నన్ను సభలో అందరికీ 'నా క్లాస్‌మేట్'అని చెప్పటం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**డిసెంబర్ 2018**

02 ఆదివారం - శ్రీగురుదశమి- ఉదయం 11గం. సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

03 సోమవారం - శ్రీసద్గురుదేవులు స్వస్వరూపలయం పొందిన రోజు - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

13 గురువారం - సుబ్రహ్మణ్య షష్ఠి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

18 మంగళవారం - ముక్కోటి ఏకాదశి, గీతా జయంతి, సాయంత్రం 5గం॥30నిలకు సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

22శనివారం - పూర్ణిమ - సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

25 మంగళవారం - క్రిస్మస్ - ఉదయం 11 గం॥లకు, సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

31సోమవారం- శ్రీగురుదశమి. సాయంత్రం 5గం॥ల30నిలకు,సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

**జనవరి 2019**

01 మంగళవారం - ఆంగ్ల సంవత్సరాది, సాయంత్రం 5గం॥ల30నిలకు. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

14 సోమ -భోగి - సాయంత్రం 5గం ॥30నిలకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, శ్రీబాబుకు భోగిపళ్ళు పోయటం, భక్తసమారాధన.

15 మంగళ - మకర సంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, సాయంత్రం 5గం॥ల30నిలకు,సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

21 సోమ - పూర్ణిమ - సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము, భక్తసమారాధన.

26 నుండి 30 వరకు వార్షిక సత్సంగ సమావేశములు.

# దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి

– సుషుమ్నా ప్రసాద

దీపం వుండగానే యిల్లు చక్కబెట్టుకోవాలి. అనే ప్రసిద్ధ నానుడి మనం అనాదిగా వింటున్నాము. దీపం కాంతికి సంకేతం. వాచ్యార్థంలో చూస్తే దీపం (కాంతి) వుండగానే యింటిని చక్కగా శుభ్రపరచుకోవాలి అంటే కాంతివంతం చేసుకోవాలి. చీకటిలో మనకేమీ గోచరించదు. అంతరార్థమును గ్రహిస్తే, ఈ దేహమే ఇల్లు. ఇందులో చైతన్యం జ్యోతిగా ప్రకాశిస్తుండగానే, నీ జీవిత పరమార్థమును సాధించాలి. నీ లక్ష్యార్థమును అంటే గమ్యాన్ని చేరుకోవాలి. బాహ్య జగత్తులో మనం ఇల్లు కొనుక్కోవాలంటే దాని మీద నీకు సర్వ హక్కులు వుండాలి. దానిని నీవు దానం చేసుకోవచ్చు, లేదా అమ్ముకోవచ్చు, లేదా ఒక మ్యూజియంగా మలచుకోచ్చు. మొగల్ సామ్రాజ్య నేత షాజహాన్ తన ప్రేయసి ముంతాజ్ స్మృత్యర్థం తాజ్‌మహల్‌ను నిర్మించారు. ఆ భవనం నేటికీ ప్రపంచంలో ఏడు అద్భుతాలలో ఒక్కటిగా నేటికీ ప్రకాశిస్తున్నది. కాని ఈ దేహమనేది కేవలం ఒక అద్దె కొంపలాంటిది. దానిపై మనకెలాంటి హక్కులు, ఆధిపత్యం లేదు. అద్దెకొంపకంటే హీనమైనది కూడా. అద్దింటిలో కోరుకున్నప్పుడు ప్రవేశిస్తాము, వద్దనుకున్నప్పుడు ఖాళీ చేస్తాం. కానీ ఈ దేహమనే గేహంలో ఎప్పుడు ప్రవేశిస్తామో తెలియదు, ఎప్పుడు నిష్క్రమిస్తామో తెలియదు. అల్పజ్ఞుడైన మానవుడికి ఆ ప్రవేశ నిష్క్రమణలెప్పుడో తెలియదు. అది కేవలం ఆ జగన్నాటక సూత్రధారి నిర్దేశానుసారంగా మాత్రమే జరుగుతుంది. ఆయన సూత్రధారి. మానవుడు కేవలం పాత్రధారి.

కర్మ అనే మూల్యం చెల్లించడం పూర్తికాగానే ఈ దేహమనే యింటితో నీ కెలాంటి సంబంధం వుండదు. కానీ ఈ దేహాన్ని దుఃఖాలయంగా మార్చుకోవటం, లేదా ఆనంద నిలయంగా మలచు కోవటమనేది మానవుని ఆధ్యాత్మిక సాధనపై ఆధారపడి వున్నది. అందుచేతనే మానవ జన్మ అనేది సద్గురుదేవుడు మనకు ప్రసాదించిన అపురూపమైన వరం. పశు పక్ష్యాదులకు, క్రిమికీటకాదులకు ఈ మేధస్సును, వివేచనా శక్తిని ప్రసాదించలేదు భగవానుడు. ఆహార నిద్రా మైథునాది ప్రక్రియలు జీవులందరికీ సమానమే. వాటితోనే సంతృప్తి

పొందగలమనుకుంటే పశువులు చతుష్పాద జంతువులైతే, మానవుడు ద్విపాద జంతువవుతాడు. పశువులు అడ్డంగా పెరుగుతూ వుంటాయి. కానీ మానవుడు నిలువుగా, నిటారుగా ఎదుగుతాడు. భగవంతుడు ప్రసాదించిన వివేచనా శక్తితో, నిత్యానిత్య వస్తువివేకము కలిగి, ఏది నిత్యమో, అది అనిత్యమో తెలుసుకుని, అనిత్యమైన బాహ్యజగత్తు, విషయాదులపై విముఖత (వైరాగ్యము) పెంచుకుని జనన మరణమనే వలయం నుండి విముక్తి పొందుతాడు. దీనికి శమాది షట్కసంపత్తి అనే సాధనతో పరిపక్వతనొంది, తన గమ్యాన్ని చేరుకుంటాడు. అప్పుడే మానవ జీవితం పరిపూర్ణత నొందుతుంది.

జ్యోతి, వెలుగు - జ్ఞానానికి, ఆనందానికి సంకేతము. చీకటి అజ్ఞానానికి దుఃఖానికి సంకేతము. ఇల్లు చక్కబెట్టుకోవటమంటే యింటిని (ఈ దేహం పవిత్రంగా, పరిశుద్ధంగా వుండే యిల్లు.) ఆధ్యాత్మిక సాధన చేయాలి. ఇంగ్లీషులో ఒక సామెత వుంది. **'Cleanliness is next to Godliness'** పారిశుద్ధ్యం పవిత్రతకు దారితీస్తుందని. మనస్సును పవిత్ర భావాలతో నింపుకోవాలి. అందుచేతనే స్కందోపనిషత్ యిలా ప్రబోధన చేసింది....

**దేహూ దేవాలయ ప్రోక్తో జీవో దేవ స్సదాశివః** - దేహాన్ని దేవాలయంగా భావిస్తే జీవుడే సదాశివుడిగా ప్రకాశిస్తాడు. దేవాలయంలో ప్రతివారూ హృదయాన్ని పవిత్ర భావాలతో నింపుకుని, పవిత్రంగా వుండాలని ఆశిస్తారు. కృషిచేస్తారు. అదే అంతర్ముఖ సాధన. అలా చేస్తే దేహమనే దేవాలయం అఖండమైన జ్ఞాన జ్యోతితో ప్రజ్వలిస్తూ పరిసరాలన్నిటినీ కూడా కాంతిమయం చేస్తుందని బాబూజీ మహరాజ్ ఎప్పుడూ బోధ చేస్తుండేవారు.

పదిమారులు నీట మునిగితే శుచిర్భూతుడు కాదు. మనో మాలిన్యాన్ని రహితం చేసుకోవటమే నిజమైన స్నానమని, ఇంద్రియ నిగ్రహం కలవాడే శుచిర్భూతుడని ప్రవచించేవారు. **స్నానం మనోమల త్యాగం, శౌచమింద్రియ నిగ్రహః** (స్కందోపనిషత్) మనోమాలిన్యం రహితం కాకుండా ఎన్నిసార్లు స్నానం చేసినా నిష్ప్రయోజనమే. బాహ్య శుద్ధి, దేహ పరిశుభ్రత ఆంతరంగిక శుద్ధికి పవిత్రతకు కూడా దోహదం చేస్తుంది. ఇల్లు చక్కబెట్టుకోవటానికి బాహ్యశుభ్రత, ఆంతరంగిక పవిత్రతతో సమన్వయం కావాలి.

# దివ్యాభరణాలు

కీ.శే - మద్ది నాగేశ్వర రావు

పోతనకు గుణపాఠం నేర్పాలనుకున్నాడు శ్రీనాధుడు. ఎప్పుడూ శ్రీరామ చంద్రుని పాదార్చనయేకాని, ఏ మహారాజులనో ఆశ్రయించి తన భార్యా బిడ్డలను పోషించుకుందామనే ఆలోచనే లేదయ్యే తన బావ పోతనకు.

"బావగారూ! రేపు ఆదివారం మా యింట్లో పెద్ద విందు జరుగ బోతోంది. పెద్ద పెద్ద మహారాజులు, రాణులు అందరూ వస్తున్నారు. మీరు, అక్కా వస్తేగానీ నా మనస్సుకు సంతోషం ఉండదు. కాబట్టి మీరు తప్పక రావాలి" అన్నాడు శ్రీనాధుడు.

"మీ అక్క తప్పక వస్తుంది లే!"

"మా అక్క మంచి ఆభరణాలతో వస్తేనే గౌరవంగా వుంటుంది. ఆలోచించి ...................."సరే! అలాగే వస్తుందిలే" అన్నాడు పోతన.

శ్రీనాధుడు అక్క దగ్గరకు వెళ్ళి గట్టిగానే చెప్పాడు. "చింపిరి తలతో, చిరిగిన గుడ్డలతో వచ్చావా నా పరువు పనిగట్టుకుని తీసినట్లే. అక్కా! బావగారితో పోట్లాడయినా సరే మంచి ఆభరణాలతో రావాలి సుమా!" అన్నాడు.

అలా భార్య గట్టిగా పట్టుపడితే అయినా తన బావకు రాజులను ఆశ్రయించాలనే బుద్ధి కలుగకపోతుందా! ఇంటిలోని పోరుకు ఎంతవారైనా నిలబడలేరు కదా? అని శ్రీనాధుడి ఆలోచన.

"ఏమండీ! మరి ఆభరణాల సంగతి ఆలోచిస్తున్నారా? విందు దగ్గర పడుతోంది" అన్నది.

"ఆ రోజుకు అన్నీ అవే వస్తాయి" అన్నాడు పోతన.

"ఉపాయం ఏదైనా ఆలోచించారా?"

"ఆశ్రయించటం కన్నా గొప్ప ఉపాయం వేరొకటి వున్నదా?" అన్నాడు పోతన.

"నాకు కావలసినది ఆభరణాలు. మీరు ఎవరినైనా ఆశ్రయించండి" అన్నది భార్య.

"ఇంకా సరిగ్గా - ఆ లక్ష్మీకాంతుణ్ణి ఆశ్రయించే ఒడుపు- కుదరటం లేదే" అన్నాడు పోతన దీనంగా.

ఆమె విసిగిపోయింది.

ఆమెకు ఉత్సాహాన్ని కలిగించాలని "పిచ్చిదానా! చూసుకో. ఆరోజుకు

అన్నీ అవే వస్తాయి" అన్నాడు పోతన.

ఇట్టి ఊరడింపు మాటలు విని విని వేసారిపోయింది ఆమె.

ఆ రోజు రానే వచ్చింది.

"ఏమండీ! తెచ్చారా?" అని అడిగింది ఆతురతగా.

పోతన భాగవత రచనలో మునిగిపోయాడు. ఇల్లాలి మాటలు చెవిన పడలేదు. చూడగల నేర్పుగల వారికి మాత్రము ఆయన లలాట ఫలకంలో భాగవత కథ దృశ్యం వెనుక దృశ్యంగా సాగిపోతున్నది.

"ఏమండీ! మా అన్నగారింటికి విందుకు వెళ్ళాలి"

భాగవత కథా ప్రవాహం నుండి కనులు తెరిచాడు పోతన. "ఆఁ మరిచాను ........."

"ఎవరిని? నన్నా? ఆభరణాలనా?"

"ఊఁ పెట్టుకో పో! ఆ పెట్టెలో వున్నాయి. ఇక్కడ అలంకరణ ఆగిపోతున్నది" అన్నాడు పోతన.

ఆమె ఆతురతగా లోపలికి వెళ్ళి పెట్టె తీసింది. కళ్ళు జిగేలు మనే లాగా వజ్ర వైఢూర్యాలతో కూడిన ఆభరణాలు, చీనీ చీనాంబరాలు. "ఎక్కడివి ఇవి? మొత్తానికి ఏ రాత్రో ఏ రాజు కాళ్ళో పట్టుకొని, భాగవతం అంకితం ఇస్తానని చెప్పి, ఇవన్నీ తెచ్చి వుంటారు. సరేలే! కాలం గడిచిపోతోంది. తీరుబడిగా ఇవన్నీ తరువాత విచారించవచ్చు" అనుకొని అందంగా ముస్తాబయి పుట్టింటికి బయలుదేరింది పోతన భార్య.

శ్రీనాధుడు తన అక్కా బావలకు బాగా కయ్యం జరిగి వుంటుందనీ, ఏ ముస్తాబుతో ఆమె వస్తుందోనని ఎదురుతెన్నులు చూస్తున్నాడు. అల్లంత దూరంలో రానే వస్తోంది. ఎవరూ? తన అక్కా? కాదు. అవును. అదేమిటి? లక్ష్మీదేవిలా దివ్యతేజస్సుతో వస్తోంది! ఆ ఆభరణాలు! అసలు తన అక్కేనా? ఏమిటీ సందేహం! మరి ఆ ఆభరణాలు! ఆ అలంకరణ! "అక్కా! నువ్వేనా? ఎక్కడివీ ఆభరణాలు?" అడిగాడు శ్రీనాధుడు. "ఏమో తెలియదురా. పెట్టెలో వున్నాయి పెట్టుకో అన్నారు మీ బావగారు" అన్నది తన అక్క.

"ఎవరిచ్చారని అడుగుతున్నాను" అన్నాడు శ్రీనాధుడు.

"ఎవరని చెప్పను? ఆ దేవుడు!" అన్నది అక్క.

విందు పూర్తి అయింది. శ్రీనాధుడు శ్రీకాంతుని భక్తుని సన్నిధికి పరుగు పరుగున వెళ్ళాడు. "బావా! అక్క పెట్టుకున్న ఆభరణాలు ఏ రాజులు ఇచ్చారు?" అని అడిగాడు.

"ఏ ఆభరణాలు? నాకేమీ తెలియదే!" అన్నాడు పోతన.

"అదేనండీ! మీరే చెప్పారుట కదా! ఆ పెట్టెలో వున్నాయి పెట్టుకో"

అని అన్నాడు శ్రీనాధుడు.

"అదా! అది ఏదో మాటవరసకన్నాను. నాకేం తెలుసు?" అన్నాడు పోతన.

"అయితే మీకు తెలియదన్నమాట. పోనీ మా అక్క వచ్చి మిమ్మల్ని అడిగినప్పుడు మీరు భాగవతంలో ఏ ఘట్టం వ్రాస్తున్నారు?"

"రుక్మిణీ కళ్యాణం".

"సరిగ్గా ఆమె వచ్చి అడిగినప్పుడు ఏ పద్యం వ్రాస్తున్నారు?"

"శ్రీకృష్ణుని కలుసుకోవటానికి - దేవి పూజకు బయలుదేరుతున్న రుక్మిణీ అమ్మవారిని దివ్యాభరణాలతో అలంకరిస్తున్న పద్యం వ్రాస్తున్నాను" అన్నాడు పోతన.

శ్రీనాధుడి కళ్లనుండి ఆనందభాష్పాలు ధారగా కారి చెక్కిళ్లపై నుండి పుష్పాల్లాగా జాలువారుతున్నాయి.

"నాకు అర్థమయింది ఇప్పుడు. ఈ పరమ భక్తుడు నన్ను ఆభరణాలతో అలంకరిస్తున్నాడు కదా! మరి ఇతని భార్యకు నేను ఆభరణాలు ఇవ్వద్దా అని తలచి ఆ రుక్మిణీ అమ్మవారే స్వయంగా మా అక్కకు ఆభరణాలు అనుగ్రహించింది. ఇది ఆ లక్ష్మీ కటాక్షమే. సందేహం లేదు" అన్నాడు శ్రీనాధుడు.

మాటలు విన్న ఆ పోతనా మహాత్ముడు ఆనందాబ్ధిలో ఓలలాడాడు!! *



గుంటూరు వాస్తవ్యులు శ్రీ కౌశిక కాశీ విశ్వనాథం పంతులు గారిని సత్కరిస్తు న్న శ్రీ మాతాజీ

# భక్తిలోగల మాధుర్యం

- గాలి జగదీశ్

ఒక రాజ్యంలో, ఒక దొంగ, ఒకనాటి రాత్రి ఆ రాజుగారి శయనమందిరంలోకి చాటుగా ప్రవేశించి, ఆయన నిదురించాక, దోచుకోవాలనే సంకల్పంతో ఆ మందిరంలో ఒక మూల దాక్కుని ఉన్నాడు. ఆ రాజుగారు, రాణి కూడా నిదుర పోకుండా కబుర్లు చెప్పుకుంటున్నారు. వారి మాటలు ఈ దొంగ చాటుగా వింటూ తగిన సమయం కోసం వేచి వున్నాడు. అప్పుడు రాజు తన భార్యతో తమ కుమార్తెకు తగిన వయస్సు వచ్చిందని మంచి వరుణ్ణి చూసి వివాహం చేయాలనుకుంటున్నానని చెబుతున్నాడు. వారిద్దరూ ఆ విషయంలో వాదోపవాదాలు చేసి, చివరకు రాజు తన కుమార్తెను పరమ భక్తుడికి ఇచ్చి చేస్తానని, కులమత ప్రసక్తి లేదని, ధనిక పేద భేదం లేదని, ఎవరైతే నిరంతరం భగవన్నామ స్మరణ చేస్తూ వుంటాడో అతనికే తన కూతురునిచ్చి చేసి, అర్ధరాజ్యాన్ని కూడా ఇస్తానని నిర్ణయించి చెప్పాడు తన భార్యతో.

ఈ విషయం విన్న దొంగకి మనసులో ఒక ఆలోచన వచ్చింది. ఈ చిన్న దొంగతనం చేసే కంటే కొంతకాలం భక్తుడిగా నటిస్తే, రాజకుమార్తెను, అర్ధ రాజ్యాన్ని కూడా పొందవచ్చు కదా అని అనుకుని, అక్కడి నుండి తాను వచ్చిన దారిలోనే వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. మరుసటి రోజు నుండి తన వేషభాషలను కూడా మార్చివేసి, భక్తుడిగా నటిస్తూ, నిరంతరం నామస్మరణ గట్టిగా చేస్తూ కాలం గడపసాగాడు.

ఆ మరునాడే మహారాజు తన భటులను పంపి, రాజ్యంలో భక్తుడైన యువకులు ఎవరైనా వున్నారేమో అని వెదకి, కనిపెట్టి, వానిని వరుసగా 6నెలల పాటు అతని ప్రవర్తనను గమనించి, తరువాత తన దగ్గరకి తీసుకు రమ్మనమని చెప్పాడు. భటులు అలాగే చేస్తూ, పట్టణమంతా పర్యటిస్తూ చివరకు ఈ కపట భక్తుడి దగ్గరకు వచ్చి, అతడిని గమనించసాగారు. ఈ విషయాన్ని కనిపెట్టిన ఆ దొంగ భక్తుడు తన పథకం పారిందని సంతోషించి, ఇంకా తీవ్రతరంగా నామస్మరణ చేయసాగాడు. ఇలా 6నెలలు గడిచిపోయాయి. ఒకరోజు భటులు ఇతన్ని రాజు దగ్గరకు హాజరుపరచారు. రాజు అతనికి తన నిర్ణయాన్ని తెలిపి,

తన కూతురిని, అర్ధ రాజ్యాన్ని కూడా స్వీకరించమని ప్రార్థించాడు.

కానీ అప్పటికే ఆ కపట భక్తుడు తన మనస్సులో విచారణ చేసుకున్నాడు. ఈ ఆరు నెలలు భక్తుడిగా నటిస్తుంటే ప్రజలంతా తనని ఎలా గౌరవించారో, అంతకు ముందు తాను గడిపిన జీవితంలో తాను పట్టుబడినప్పుడల్లా ప్రజలు తన పట్ల ఎలా ప్రవర్తించేవారో, ఆ రెండూ కూడా బేరీజు వేసుకున్నాడు. నటిస్తేనే ఇంత హాయిగా వుంది కదా! ఇక నేను నిజంగా మనస్సు శుద్ధిచేసుకుని, భక్తుడిగా మారిపోతే ఇంకెంత ఆనందం పొందుతానో కదా! అని నిశ్చయించుకున్నాడు. కాలక్రమంలో అతనికి సత్యమైన భక్తి, నిజమైన వైరాగ్యము కలిగాయి. భగవద్భక్తిలోని మాధుర్యం చవిచూసినందున, అతనిలో అజ్ఞానం నశించి, విషయవాంఛలను బొత్తిగా విడిచినవాడై, ఆ రాజుగారి కోర్కెను తిరస్కరించి, చివాలున లేచి వెళ్లిపోయాడు.

భగవద్గుణానుభవం రుచి మరిగి తదేక నిష్ఠుడై, ఆత్మావలోకనం చేస్తున్నవానికి ఐహిక విషయాల పట్ల రుచి పూర్తిగా పోతుంది. అంటే మనస్సు వాటిపై పోదు. ఒకవేళ ఏదైనా విషయంమీదకి మనస్సు పోయినా కూడా, దానిని వెంటనే తన వివేకంతో ఇది మంచిదేనా, కాదా అని చర్చించుకుని, యింద్రియాలను ఆ విషయము నందు తగుల్కొనకుండా మరలించుకుంటాడు. ఆ విధంగా యింద్రియాలన్ని ఎప్పుడు వశంలోకి వస్తాయో, అప్పుడు స్థిరమైన జ్ఞానం కలవాడు అవుతాడు. రాగద్వేషాలు నశించి, నిశ్చల మనస్కుడై శాంతిని పొందుతాడు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ పరమ భక్తులైన కొలిపాక శాంతాదేవి 21-11-2018 బుధవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 73 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**డిసెంబర్ 2018**

1-12-2018 శనివారము : సాయంత్రం 6 గం॥లకు దీపోత్సవము, రాత్రి 7గం॥లకు శ్రీసద్గురుదేవుల పుణ్యారాధన.

2-12-2018 ఆదివారము : శ్రీ గురుదశమి- తె. జా 3గం॥లకు శ్రీ సద్గురు దేవులకు రుద్ర నమక, చమక సహిత మహాభిషేకము, ఉదయం 7గం॥లకు సామూహిక సద్గురుపూజలు, ఉ॥10గం. శ్రీసద్గురుపాదపూజ, సా॥5గం. హోమం. సా॥6.00గం. రథోత్సవము.

3-12-2018 సోమ : 'శ్రీ స్వామి వారు స్వస్వరూపం పొందిన రోజు -ప్రాతఃకాల సద్గురుపాద పూజ, దీక్షావిరమణ. హోమం పూర్ణాహుతి, సా ॥ 6-30ని॥ శ్రీస్వామివారి నగరోత్సవము.

05 బుధ - మాస శివ రాత్రి, పావులూరు శాఖలో ఏకాహం.

07శుక్ర - అమావాస్య

13 గురు - శ్రీ సుబ్రహ్మణ్య షష్టి.

16 ఆది - ధనుర్మాస ప్రారంభము.

18 మంగళ- ముక్కోటి ఏకాదశి, గీతా జయంతి, ఉదయం 9॥ గంలకు శ్రీమద్భగవద్గీత పారాయణ, ముక్కోటి ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనము; శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

22 శని - పూర్ణిమ, - శ్రీదత్తాత్రేయ జయంతి. శ్రీ సద్గురు పాద పూజ.

25 మంగ - క్రిస్మస్ - శ్రీసద్గురుపాదపూజ.

31సోమ - గురు దశమి, సత్సంగము, శ్రీ సద్గురు పాద పూజ

**జనవరి 2019**

01 మంగ - ఆంగ్ల సంవత్సరాది, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన

03 గురు- మాస శివరాత్రి, పావులూరు శాఖలో ఏకాహం

05 శని - అమావాస్య

14 సోమ - భోగి , శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 8గం. శ్రీబాబుకు భోగిపళ్ళుపోయుట.

15 మంగ - మకర సంక్రాంతి; శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన, ఉత్తరాయణ ప్రారంభం.

16 బుధ - కనుమ

21 సోమ - పూర్ణిమ , శ్రీ సద్గురు పాదపూజ,

25 శుక్ర - శ్రీత్యాగ రాజ స్వామి వారి ఆరాధన.(పుష్య బహుళ పంచమి)

30 బుధ - గురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**ద్వితీయాశ్వాసము - 97వ శ్లో॥**

**దేవక్యా జఠరాకరే సముదితః క్రీతో గవాం పాలినా।**
**నన్దే నాకకదున్దుభేర్నిజసుతా పణ్యేన పుణ్యాత్మనా।**
**గోపాలావళి ముగ్ధహార తరళో గోపీజనాలఙ్కృతిః।**
**స్ఫేయాన్నో హృదిసన్తతం సుమధురః గోఽపీన్ద్ర నీలోమణిః॥**

తాత్పర్యము -



దేవకి యొక్క గర్భ సముద్రమునందు పుట్టినదియు, పుణ్యమూర్తియగు నందు డనెడు ఆలకాపరిచేత వసుదేవుని వలన తన కూతురనెడు వెలచేత కొనబడినదియు, ఆలకాపరుల బాలునెడి అందమైన మాలకు నాయకమణి యైనదియు, గోపకిల సొమ్ముయైనదియు, అత్యంత సుందరమైన, వర్ణింపరాని నీల రత్నము మా యొక్క చిత్తమందెప్పుడూ వుండు గాక!

శ్రావణ బహుళాష్టమి, నడిరేయి.... చీకట్లు కమ్మి వున్న చెరసాలలో దేవకీదేవి ప్రసవ వేదన పడుతున్నది. ఆమె ప్రక్కనే వున్న వసుదేవునికి మనస్సంతా ఆందోళనగా వుంది. పుట్టబోయే పసికందును భూమి మీదకు రాగానే కంసుడు ప్రాణాలు తీసేస్తాడు కదా! శ్రమ పడుతున్న దేవకిని ఎలా ఓదార్చాలి? ఇద్దరికీ సంకెళ్ళు చేతులకీ, కాళ్ళకీ వున్నాయి. ఒక్కసారి దేవకి దేవిని తనివి తీరా చూడాలనే తన కోర్కెను వరుణదేవుడు కరుణించినట్లుగా, బయట ప్రకృతి అంతా కుంభవృష్టిలా కురుస్తున్న వాన, గొప్ప గొప్ప మెరుపులు మెరుస్తున్నాయి. ఆ మెరుపు వెలుగులో కనీకన బడనట్లుగా కనిపిస్తోంది దేవకీదేవి. అంతలో గొప్పకాంతి చెరసాల నిండా నిండిపోయింది. శంఖ చక్రధారి అయిన శ్రీమన్నారాయణుడు వాళ్ళకి ఎదురుగా సాక్షాత్కరించాడు. బ్రహ్మాదిదేవతలంతా స్తుతిస్తున్నారు.

అప్పుడు వసుదేవునికి జరుగబోయేదంతా తన ఆజ్ఞగా వినిపించాడు. ఆ మరుక్షణమే పసిబాలుడై దేవకి ప్రక్కలో ఒదిగి

పోయాడు. వసుదేవుడు స్వామి ఆజ్ఞానుసారమే ఆ పసివానిని తలమీద ఎత్తుకుని చెరసాలలో ముందుకి నడిచాడు. సంకెళ్ళు అన్నీ విడిపోయాయి. తలుపులు మూస్తూ తెరుస్తూ ఆదిశేషుడాయనను అనుసరించాడు. వసుదేవుడు చెరసాలదాటి యమునానదివైపు నడిచాడు. కాపలా వారంతా మాయావశులై నిద్రిస్తున్నారు.

వానలో తడవకుండా ఫణిరాజు తన పడగ గొడుగులా పట్టాడు. ఉధృతంగా ప్రవహిస్తున్న యమునానది స్వామిని చూడగానే బ్రహ్మానంద పరవశయై వడి తగ్గి వారికి దారి యిచ్చింది. యమున దాటి వసుదేవుడు నందుని యింటికి వ్రేపల్లె చేరాడు. నందుడింటిలో కూడా అందరూ నిద్రాపరవశులై వున్నారు. స్వామి ఆదేశప్రకారం యోగమాయ నందుడి భార్య యశోదకు ఆడపిల్లగా జన్మించింది. వసుదేవుడు తాను తెచ్చిన పసివానిని యశోద ప్రక్కలో పడుకోబెట్టి, ఆ ఆడపిల్లను తన చేతిలోకి తీసుకుని, తాను వచ్చిన దారినే తిరిగి బయలుదేరాడు .

పుణ్యమూర్తి అయిన నందుడు వసుదేవుని కుమార్తె చేత కొనబడిన పసివాడు నందబాలుడుగా వ్రేపల్లెలో పెరుగసాగాడు. అక్కడ తన లీలన్నీ చూపించాడు. గోపాల బాలురనే అందమైన రత్నమాలకి నాయక మణిగా వెలిగి, గోపికల సొమ్ము అత్యంత సుందరమైన వర్ణింప రాని నీలమణిగా శోభించే శ్రీమన్నారాయణుడు యశోదానందుడి లాగా మా మనస్సులలో ఎప్పుడూ ఉండుగాక!

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా డిసెంబరు 2018, జనవరి 2019 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

డిసెంబరు 2018: AS 0700, 6373, 6982, 7193, 7197, 7418, 7196, 7616, 7617,
AS 7618, 7625, 7627, 7628, 7630, 7631, 7417.

జనవరి 2019 : AS 4174, 4914, 5490, 5665, 6065, 6483, 6620, 6815, 7162,
AS 7173, 7420, 7421, 7427, 7429, 7430, 7433, 7438, 7641,
AS 7635 నుండి 7638, 7642, 7645, 7646, 7648 నుండి 7666,
AS 7969, 7670

మేనేజరు

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

'ఆత్మానుభూతి అంటే ఏమిటి?' అనే ప్రశ్నకు సమాధానంగా సద్గురుదేవులు వివరణ ఇస్తూ "నేను ఆత్మానుభూతిని పొందాను అనే భావన తప్పు. ఆ అనుభూతి ఈ క్షణంలో వుండి మరుక్షణంలో పోయేది కాదు. అది శాశ్వతమైనది. పరిణామము లేనిది. అది వచ్చేది, పోయేది కాదు. అది ఒక అనుభూతి. అది అనుభవమేకాని వ్యక్తం చేసేది కాదు. అది దృశ్యం కాదు కాబట్టి గోచరించేది కాదు. అది మాటలతో శబ్దాలతో వర్ణించేది కాదు. అవాఙ్మానస గోచరమైనది. అది వస్తువు అంతకన్నా కాదు. పంచదార నోట్లో వేసుకున్నావనుకో. ఆ మధురానుభూతి ఆ వ్యక్తికే పరిమితమై వుంటుంది. అది వేరొకరికి గోచరించేది కాదు. అలాగే నీ వీపు మీద ఒక ఈగ వాలిందనుకో. ఈగ నీకు కనపడకపోయినా, ఈగ వాలిందని తెలుసుకో గలుగుతావు.



ఇవి కేవలం ఉపమానాలుగా తెలుసుకోండి. ఆత్మానుభూతి కూడా అటువంటి అనుభూతే. అయితే ప్రాపంచిక వ్యవహారాలలో పొందిన అనుభూతి తాత్కాలికమైనది. అశాశ్వతమైనది. అది ఆ క్షణానికే పరిమితం. మరుక్షణం అది వుండదు. కాని ఆత్మానుభూతి అలా కాదు. అది శాశ్వతానంద స్థితి. అది దుఃఖరహిత స్థితి. నిదురలో దుఃఖం లేదు. మత్తు పదార్థం సేవించినప్పుడు దుఃఖం లేదు. అయితే కేవలం ఆ స్థితి అశాశ్వతమైనదే.

నిదుర నుంచి మేల్కొనిన వెంటనే తిరిగి సుఖదుఃఖాలకు తావు వుంటుంది. అయితే ఆత్మానుభూతిని ఉపనిషత్తు వర్ణించినట్లుగా 'పరేణనాకం' అంటే ఆ ఆనందానికి అవధులు లేనిది. పరిమితి లేనిది. హెచ్చుతగ్గులు లేనిది. దానిని చవిచూసిన వారెవరైనా వేరొక ప్రాపంచిక ఆనందాన్ని గాని, ప్రాపంచిక విషయాదులు గాని, ఎన్నడూ వాంఛించరు. అయితే ఆ ఆనందం ఎక్కడ వుంది? నీలో వుందా? నీకు వెలుపల వుందా? అది నీలోనే వుంది. అంటే 'అంతఃస్ఫురితం' అన్నమాట. అంటే నీ

అంతరంగంలో నీ హృదయ కుహరంలో దాగి వుంది. అంతేకాదు. అంతటా వ్యాప్తమై వున్నది. అదే అమృతత్వము. దానిని మానవులు ఎందుకు పొందలేక పోతున్నారు?

పెరుగులో అంతా వ్యాప్తమై వెన్న వున్నప్పటికీ, పెరుగుని చిలికితేగా వెన్న వచ్చేది. అలాగే సద్గురుమూర్తి అందించిన బోధని మనస్సుతో తీవ్ర ఆవేదనతో, ఆకాంక్షతో విచారణ ద్వారా చిలకాలి. అప్పుడే ఆ మాధుర్యం అందుతుంది. ఆనందానుభూతి కలుగుతుంది. అదే 'సాక్షాత్కారము'. అయితే ఆత్మ సాక్షాత్కారాన్ని సాధకులు అంత సులభంగా పొందలేక పోవటానికి కారణమేమిటి? ఆత్మవస్తువు సాధకుని అంతరంగంలోనే వుంది కదా! అనే ప్రశ్న ఉదయించవచ్చు.

ఆ సందేహాలకు సమాధానంగా సద్గురు దేవులు మాట్లాడుతూ దేహ, మనో, బుద్ధులతో ప్రాపంచిక విషయాదుల తాదాత్మ్యమే బంధన. అది వీడటం కష్టం. అటువంటి ప్రాపంచిక విషయాదుల మోహం నుండి బయల్పడాలంటే జ్ఞానం ద్వారానే సాధ్యం.

ఎలాగయితే స్వప్నం నుండి మేల్కొన్న వ్యక్తి స్వప్నానుభవాల నుండి జాగ్రదావస్థలో విముక్తి చెంది, ఆ స్మృతులను మరచిపో గలుగుతాడో జ్ఞానం ద్వారా జగత్తు అనే భావన మనస్సు నుండి తొలగిపోతుంది. సాధనలో పైకి ఎదిగిన వ్యక్తికి వ్యవహారిక చింతన వుండదు. ఇంటింటి రామాయణాలు వుండవు. విచారంతో కూడిన వికార దృష్టి వుండదు.

వివేకవంతమైన విచారణతో మనోలయం మౌతుంది. మనోలయమే ముక్తి. ఆత్మానుభూతి అన్నా, ముక్తి అన్నా, మోక్షం అన్నా, భాషలో భేదమే గాని అనుభూతి ఏకత్వమే. ఆత్మానుభూతి పొందేది కాదు. గుర్తించేది. అనగా సిద్ధింపజేసుకునేది. దానికి సద్గురుమూర్తి మార్గదర్శకత, తోడ్పాటు ఎంతో అవశ్యము. అటువంటి సాధకుడే ముముక్షువు.

శుభాభినందనలతో ...


**Grand**

**R A D I A T O R S**

**AN ISO 9001:2008 CERTIFIED COMPANY**

Manufactures of Radiators (Automobile and Industrial), Oil Coolers, Air Coolers, After Coolers, Inter Coolers, Finned Tube Coolers, Shell and Tube Heat Exchngers,Tube Bundles,Condernsers,Cooling Coils,All Pre-Heaters, Large After Coolers and Mechanically Bonded Radiators









# GRAND RADIATORS

PLOT NO 131, BLOCK – D, AUTONAGAR,
VISAKHAPATNM -530012 AP, INDIA
TELPHONE: 0891-2517706, 2564538, FAX NO. 0891-2513660, 2502640
E-mail: grandradiator@yahoo.in  Website: www.grandradiators.com

# తితీక్ష

- పాలూరి కాళీప్రసాద్

మన ఆధ్యాత్మిక సాధనకు తోడ్పడే సాధనాలలో వివేక, వైరాగ్యాల తరువాత ముఖ్యమైనవి శమాదిషట్క సంపత్తి. శమము అంటే అంతరేంద్రియ నిగ్రహము; దమము అంటే బాహ్యేంద్రియ నిగ్రహము; ఉపరతి అంటే ఎప్పుడూ ఆ పరమాత్మ వస్తువునందే మన మనస్సు రమిస్తూ వుండటం; తితీక్ష అంటే మానావమానాలను సమానంగా స్వీకరించ గలగటం; శ్రద్ధ అంటే మన సాధన యందు ఆసక్తి కలిగి, చక్కగా చేయగలగటం; ఇక సమాధానము  అంటే అంతా భగవంతుని ఇచ్ఛతోనే జరుగుతోందని గ్రహించి, ఎక్కడికక్కడ మనకు లభించిన దానితో తృప్తి పడటం.

మనం ఎంతటి ఆధ్యాత్మిక సాధనలో వున్నా, సంఘజీవులము కాబట్టి బయటి ప్రపంచంతో సంబంధం తప్పదు. మరి ఆ సంఘంలో అనేక రకాలైన మనస్తత్వాలు కలిగిన వ్యక్తులు వుంటారు. కొందరు అందరితో మంచిగా వుంటూ, తాము ఆనందిస్తూ, ఎదుటి వారిని కూడా ఆనందింపజేస్తూ వుంటారు. మరికొందరు వారికి ఏ అవసరమూ లేకపోయినా ఎదుటివారి విషయంలో కల్పించుకుంటూ లేనిపోని సలహాలు యిస్తూ వుంటారు. ఇంకొందరు మరికొంచెం ముందుకు వెళ్ళి, తమకేదో చాలా బాధ్యత, ప్రేమ వున్నట్లుగా 'ఏమమ్మా! మీ అమ్మాయికి యింక పెళ్ళి చెయ్యరా?', 'మీ అబ్బాయి మొన్ననే ఉద్యోగం మానేసి వచ్చేశాడుట కదా? అయ్యో ఉన్న డబ్బంతా అలా ఖర్చు పెట్టేస్తే ఎలా?','మరీ ఇంత పిసినారితనం పనికిరాదు.....' అంటూ ఇలా రకరకాలగా సూటిపోటి మాటలతో కాకుల్లాగా పొడుస్తూ వుంటారు.

ఇలాంటి వారిని చూసినప్పుడు మనకు సహజంగా కోపం వస్తుంది. 'ఏరా ! నీ వల్ల దేశానికి ఏమి వుపయోగం?' అని అడగాలనిపిస్తుంది. కానీ కొంచెం లోతుగా ఆలోచిస్తే, భగవంతుని సృష్టిలో వ్యర్థమైనది ఏదీ లేదు. ప్రతిదానికీ ఏదో ఒక ప్రయోజనం వుంటుంది. అయితే ఇలాంటి వారి వల్ల ఏమి ప్రయోజనమో ఇప్పుడు చూద్దాం.

పైన చెప్పిన శమాది షట్కసంపత్తిలో మిగిలిన అయిదు గుణాలను మనం ఎంతవరకు అలవరచుకున్నామో తెలుసుకుంటూ, ఆ యా గుణాలను ఇంకా పెంపొందించుకోవటానికి మనలను మనమే

ఎప్పటికప్పుడు పరీక్షించుకుని అంచనా వేసుకోవటానికి వీలు పడుతుంది. కానీ తితిక్షను మాత్రం మనలను మనం పరీక్షించుకో లేము. దానికి ఇటువంటి వ్యక్తుల సహాయసహకారాలు మనకు ఎంతగానో తోడ్పడతాయి. ఇలాంటివారు ఎదురైనప్పుడల్లా వారి మాటలను అవమానకరంగానో, బాధాకరంగానో భావించక, మన తితిక్షను పరీక్షించుకోవడానికి ఒక చక్కని అవకాశంగా స్వీకరించి, ఎన్ని నదులు వచ్చి తనలో కలసినా, సముద్రం ఎలా తొణకక, బెణకక నిశ్చలంగా వుంటుందో, అలాగే ఎన్ని అవమానాలు ఎదురైనా మన మనస్సుని నిశ్చలంగా వుంచుకోగలగటం నేర్చుకోవాలి. అప్పుడే మనం పరమ శాంతిని పొందగలుగుతాము.

ఒకసారి బుద్ధ భగవానుడు భిక్షాటనకు వెళ్ళినప్పుడు, ఒక ఇల్లాలు ఆయనకు భిక్ష వేయకపోగా, ఆయనను సోమరిపోతులాగా భావించి, నానా మాటలు అన్నది. అయినా ఆయన చిరునవ్వుతో అలాగే అక్కడే నిలబడి వున్నారు. కొంతసేపటికి విసుగెత్తిన ఆ ఇల్లాలు 'ఇందాకటి నుంచి ఇన్ని తిడుతున్నాను. నీకేమీ బాధ కలగటం లేదా?' అని అడిగింది. అప్పుడు బుద్ధ భగవానుడు 'తల్లీ! నీవు వేసిన భిక్షను నేను స్వీకరించలేదనుకో అప్పుడు ఆ భిక్ష ఏమవుతుంది?' అని అడిగారు. దానికి ఆమె 'ఆ భిక్ష నా దగ్గరే వుంటుంది' అని సమాధానం చెప్పింది. అప్పుడు బుద్ధుడు 'అలాగే మరి ఇందాకటి నుంచి మీరు అన్న మాటలేవీ నేను స్వీకరించలేదు' అని చెప్పి అక్కడి నుండి ముందుకు సాగిపోయారు.

ఒకసారి శ్రీ ఏకనాథ్ మహరాజ్‌వారు గంగానదిలో స్నానం చేసి వస్తుండగా, ఒక పొగరుబోతు ఆయనపై ఉమ్మివేశాడు. ఆయన మారు మాట్లాడక మళ్ళీ నదిలో దిగి స్నానం చేసి వచ్చారు. ఆ పొగరుబోతు మళ్ళీ ఆయనపై ఉమ్మివేశాడు. ఆయన తిరిగి స్నానంచేసి వచ్చారు. ఇలా 108సార్లు జరిగింది. చివరికి విసుగెత్తిన ఆ పొగరుబోతు 'నేను ఇన్నిసార్లు ఉమ్మివేసినా నీకు సిగ్గు అనిపించటం లేదా?' అని ప్రశ్నించాడు. అందుకు సమాధానంగా ఏకనాథ్ మహరాజ్‌వారు 'సోదరా! సిగ్గెందుకు? ఈరోజు ఏకాదశి. నా అంతట నేను అనుకోలేదు. కానీ నీ దయ వల్ల నేను ఈ రోజు 108సార్లు గంగానదీ స్నానం చేయగలిగాను. ఇంతకంటే మహద్భాగ్యం ఏముంటుంది?' అని నవ్వుతూ పలికారు.

(గత సంచిక తరువాయి)

# కైవల్యోపనిషత్

- రేఖ

శ్రీ మాతాజీ సాధకుడి గురించి, సాధన గురించి ఇంకా ఇలా వివరించారు. మానవుడు జీవ లక్షణాలతో కూడి వున్నవాడు. పూర్వజన్మ వాసనలతో ఆవరించి వుంటాడు కాబట్టి మహాత్ముల బోధ విన్నప్పుడు ఎంతో బాగుందని అనుకున్నా, ఇంటికి వెళ్ళిన తరువాత, సాంసారిక ఒడుదుడుకులలో పడి బోధ మరచిపోతాడు. అందుకే బ్రహ్మవిద్య అభ్యసించటం చాలా కష్టం అంటారు. దాని యందు శ్రద్ధ కలిగి వుండాలి. సమర్థుడైన సద్గురువు పాదాన్ని ఆశ్రయించి, వారు చెప్పినట్లు చేస్తే బ్రహ్మవిద్య కరతలామలకమవుతుంది. అంటే సులభతరమవుతుంది. అయితే గురువాజ్ఞ పాలన చేయాలి. అంటే గురువులు చెప్పినట్లు చేయాలి; పెట్టింది తినాలి; చచ్చినట్లు పడుండాలి. వారి బోధామృత ప్రసాదాన్ని స్వీకరించి, శ్రద్ధగా శ్రవణం చేసి, మననం, నిదిధ్యాసల ద్వారా అనుభవానికి తెచ్చుకుని, దేహాభిమానం లేకుండా వుండ గలగాలి.

ప్రపంచంలో వ్యావహారికంగా మెలగడానికి 'ఆధార్ కార్డు' అవసరమంటున్నారు ఈ మధ్య. మనకి నిజమైన ఆధారం ఆ భగవంతుడు. మహాత్ములు మనకి ఆధారం ఏమిటో ఎప్పుడో అందించి వున్నారు. 'నేను' అన్నదాన్ని గుర్తిస్తే అర్థమవుతుంది. ఈ 'నేను' దేనికి సంబంధించింది? ప్రపంచపరంగా ఎంత కూడబెట్టుకున్నా, ఎంత ఉన్నత స్థితిలో వున్నా, చివరి క్షణంలో ఇవేవీ మన వెంట రావు. 'నేను'కి అసలైన ఆధారం గుర్తించాలంటే, సద్గురువులని, మహాత్ములని ఆశ్రయించాలి. వారు మనలను మొదట 'నిర్మలాంతఃకరణ సిద్ధరస్తు!' అని ఆశీర్వదిస్తారు. తరువాత 'త్వమేవాహం' (నీవే నేను) అన్న స్థితికి తీసుకు వెడతారు.

ఆధ్యాత్మ విద్య ఒక నిధి. ఎంత తెలుసుకున్నా అది చాలదు. అందుకనే అశ్వలాయన మహర్షి గొప్ప ఆచార్యుడైనప్పటికీ, బ్రహ్మదేవుణ్ణి సమీపించి, శ్రేష్ఠమైనదీ, నిగూఢమైనదీ, సత్పురుషుల చేత ఎల్లప్పుడు అనుసరింప బడునది అయిన విద్యను బోధించమని, ఎంతో ఆవేదనతో శ్రద్ధతో వేడుకున్నాడు.

అశ్వలాయన మహర్షి తను అంతవరకూ పొందిన జ్ఞానం సరియైనదని ఒక ఆమోద ముద్ర పొందడానికి, ఆ పరతత్త్వాన్ని గురించి

మరి కొంత అధికంగా తెలుసుకోవడానికి కూడా పరమేష్ఠిని ఆశ్రయించడానికి కారణాలు అని చెప్పారు.

నిగూఢమైనది అంటే రహస్యమైనది. ప్రయత్నం వల్లనే తెలియబడేది. ప్రకృతిలో వస్తువులు తీసుకుంటే ఉదాహరణకి పాలల్లో వెన్న, కట్టెలో అగ్ని, నిగూఢంగా వుంటాయి. వెన్నని తీయడానికి ఒక పద్ధతి ఉంది. పాలని పొంగించాలి, కొంత చల్లార్చాలి, తగినంత వేడిలో పెరుగు కొంచెం వేయాలి తోడుకోవడానికి. తోడుకున్న పెరుగును మజ్జిగ చేయాలి. దాన్ని కవ్వంతో మథించాలి. అప్పుడు వెన్న బయట పడుతుంది. బాగా వేసవికాలంలో అడవిలో చెట్లు ఎండిపోయి, చెట్లు ఒకదానికొకటి రాసుకుని అగ్నిని పుట్టిస్తాయి. ఆ అగ్ని చేత మొత్తం అడవి అంతా దగ్ధమవుతుంది. యజ్ఞ యాగాదులలో అరణితో అగ్నిని పుట్టించడం లాంటిదే అనే ఉదాహరణను శ్రీమాతాజీ వివరించారు. అంటే హోమానికి కావలసిన అగ్నిని రెండు కొయ్యముక్కలను రుద్ది అప్పటికప్పుడు అగ్నిని పుట్టిస్తారు. దానినే అగ్ని మధనం అంటారు.

ఈ ప్రాకృతిక ఉదాహరణలకి ఆధ్యాత్మికపరంగా సాధన పరంగా శ్రీ మాతాజీవారు ఈ విధంగా అంతరార్థాన్ని వివరించారు.

సాధనకి కూడా ప్రయత్నం ఎంతో అవసరం. అనుష్ఠాన పద్ధతిలో ఎలా వుండాలి అంటే స్వాతి చినుకు కోసం ముత్యపుచిప్ప ఎలాగ తెరుచుకుని వుంటుందో, మనం కూడా అలా, ఎప్పుడు గురువుల అనుగ్రహం, గురువుల మహా మంత్రవాక్యం అనే చినుకు మన హృదయంలో పడుతుందా అని ఆవేదనతో ఎదురు చూడాలి.

-సశేషం

**శ్రద్ధాంజలి**

శ్రీబాబూజీ పరమ భక్తులైన గేదెల కృష్ణ మోహనరావుగారు 2-11-2018 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 84 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## బళ్ళారి శాస్త్రిగారితో శ్రీబాబు

- విజయేశ్వరానంద ప్రసాద్

ఆ తరువాత శాస్త్రిగారితో మాట్లాడుతూ శ్రీబాబు "అన్నగారూ! నేనెందుకు మిమ్మల్ని తొందర పెట్టి రుద్రునికి నవరసాభిషేకాలు చేసుకోమని పంపించానో అర్థమైందా? ఆ సమయంలో గ్రహ స్థితి మీకు చాల వ్యతిరేకంగా ఉంది. మృత్యుగండమే పొంచి ఉంది. సకాలంలో మీరు అభిషేకాలు చేసుకున్నందువల్ల ఆ గండం తప్పింది. అమ్మ దయ వలన నా సోదరుని మరొక మారు దక్కించుకోగలిగాను" అన్నారు. అనుక్షణము అలా కంటికి రెప్పలా కాపాడే సద్గురుదేవుల అపార కరుణ అనుభవైక వేద్యమైనదని, మాటలకందనిదని శాస్త్రిగారు పుప్పొంగిపోయారు.



గుండుగొలనులో 1966లో మేడబాబు గారింట్లో శ్రీ దేవీశరన్నవరాత్రి పూజలు జరుగుతున్నాయి. శాస్త్రిగారు బళ్ళారిలో జ్వరంతో బాధ పడుతూ ఉన్నందున రాలేదు. శ్రీబాబు ఒక రోజున "వెంటనే బయలుదేరి ర'మ్మని శాస్త్రిగారికి టెలిగ్రాం పంపారు. 104 డిగ్రీల జ్వరంతో ఉన్న శాస్త్రిగారికి టెలిగ్రాం అందింది. డాక్టరు ఆ స్థితిలో అంత దూరప్రయాణం చేయటం ఏమాత్రమూ పనికి రాదని చెబుతున్నా లక్ష్యపెట్టక, శాస్త్రిగారు బళ్ళారి నుండి గుండుగొలనుకు 24 గంటలు ప్రయాణం చేసి వచ్చారు.

అప్పుడు సాయంకాలం ఐదు గంటలైంది. జగన్మాత పూజ, హారతి, మంత్రపుష్పము అయిన తరువాత శ్రీబాబు నివేదన చేసుకోవలసి వున్నది. శేషగిరిరావుగారు "ఇప్పటికే ఆలస్యమైంది బాబూ! నివేదన చేసుకోండి" అని అంటుంటే శ్రీబాబు "వస్తున్నా, వస్తున్నా" అంటూ, అమ్మ పూజ గది ప్రక్కనే ఉన్న అరుగు మీద పడక కుర్చీలో కూర్చునే ఉన్నారు. అంతలో శాస్త్రిగారు వచ్చారు. సరాసరి శ్రీబాబు వద్దకు వచ్చి నమస్కారం చేశారు. శ్రీబాబు ఎంతో సంతోషంగా "హమ్మయ్య! వచ్చేశారా అన్నగారూ! మీ కోసం ఎంతసేపటి నుంచో ఎదురు చూస్తున్నాను. వెంటనే వెళ్ళి ఆ బోరింగు దగ్గర స్నానం చేసి రండి. మనిద్దరం కలిసి భోజనం చేద్దాం" అన్నారు. జ్వర తీవ్రత వల్ల శాస్త్రిగారు నిలబడలేక పోతున్నారు. మాట కూడా సరిగా రావటం లేదు. అతి నీరసంగా "జ్వరం బాబూ! అన్నారు. "అందుకేనయ్యా! చెబుతున్నాను. త్వరగా స్నానం

చేసి రండి" అన్నారు శ్రీబాబు.

గురువాక్యము శిరోధార్యం కదా! శాస్త్రిగారు తుండుగుడ్డ చుట్టుకొని ఆరుబయటనే బోరింగు వద్ద చన్నీళ్ళు స్నానం చేసి గడ గడ వణుకుతూనే వచ్చారు. "శేషగిరీ! అన్నగారికి కూడ నాతో పాటు వడ్డించు" అన్నారు శ్రీబాబు విస్తరి ముందు కూర్చున్న శాస్త్రిగారికి, విస్తరి వైపు చూడగానే కళ్ళు తిరిగినంత పనైంది. పంచభక్ష్య పరమాన్నాలూ వడ్డించి ఉన్నాయి. అప్పటికి పది రోజుల నుంచి శాస్త్రిగారు ద్రవ ధారకం మీదనే ఉంటున్నారు.

శ్రీబాబు శాస్త్రిగారి చేతిలో జగన్మాత పూజా తీర్థం పోశారు. "ఇక కానివ్వండి. ఏ ఒక్క పదార్థమూ వదిలి పెట్టకుండా తీసుకోవాలి. ఇది జగన్మాత ప్రసాదం. 'శేషగిరీ! శాస్త్రిగారి పథ్యం సంగతి చూసుకో ' అని శ్రీబాబు శేషగిరిరావుగారికి కన్ను గీటారు. అంతవరకూ, అన్నహితవు మాట అలా ఉంచి, అన్నం చూస్తేనే వాంతి వచ్చేటంత సుస్తీలో ఉన్న శాస్త్రిగారు ఏమి కలుపుకుంటున్నారో, ఏం తింటున్నారో ఆయనకే తెలియటం లేదు. "శేషగిరీ! చూస్తావేమిటీ? మరి కొంచెం పప్పు వడ్డించు" అని శ్రీ బాబు తరిమి తరిమి వడ్డన చేయిస్తున్నారు. జున్ను, గడ్డ పెరుగు, చక్రకేళీతో సహా శాస్త్రిగారు అన్నీ పూర్తి చేసేవరకు శ్రీబాబు వదిలి పెట్టలేదు. బళ్ళారి నుంచి శాస్త్రిగారితో బాటు యిరవై నాలుగు గంటలు ప్రయాణం చేసి వచ్చిన ఆ జ్వరం, యిరవై నాలుగు నిమిషాలలో మళ్ళీ బళ్ళారి కూడా దాటి వెనక్కి పారిపోయింది.

"అన్నగారూ! ఎలా ఉంది?" అన్నారు శ్రీ బాబు . ఇదంతా నిజమేనా, లేక కలగంటున్నానా అని అబ్బుర పడుతున్న శాస్త్రిగారు "నిశ్చయంగా, యిదంతా మీరే నాలో ఉండి యిలా చేయించుకున్నారని చెప్పగలను బాబూ! ఆ జ్వరమూ ఆ నీరసమూ, ఆ అన్న ద్వేషమూ ఏమైపోయాయో, యీ చన్నీళ్ళ స్నానమూ, యీ మృష్టాన్న భోజనమూ నేను ఎలా చేయగలిగానో...." అంటుంటే శ్రీ బాబు "అదిగో! ఒక ప్రక్కన 'మీరే చేయించా'రంటూ, మళ్ళీ 'నేను ఎలా చేయగలిగానో' అని పప్పులో కాలు వేస్తారేమిటి? చేసింది మీరూ కాదు, చేయించింది నేనూ కాదు. అది దయామయి అయిన జగన్మాత దివ్యలీల. సర్వత్రా నిండి ఉన్న ఆ (సత్) సద్వస్తువే మీలోనూ, నాలోనూ ఉండి తన (చిత్) చిద్విలాసాన్ని యిలా చూపి మనకు (ఆనందం) ఆనందాన్ని కలిగిస్తోంది. అదే (సత్ +చిత్ + ఆనంద) సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపము. Understand ?" అన్నారు.

-సశేషం

(గత సంచిక తరువాయి) విష్ణు  కథలు - రమణ ప్రసాద్

# శ్రీ స్వామి వివేకానంద

స్వామి వివేకానంద పేరు పూర్వాశ్రమంలో నరేంద్రనాధ్ దత్తా. ఆయన 1863 జనవరి 12వ తేదీన కలకత్తాలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించాడు. తండ్రి పేరు విశ్వనాధ్‌దత్తా, తల్లి పేరు భువనేశ్వరీ దేవి. చిన్నతనంలో నరేంద్రుడు (నరేన్) సంగీతం, సాము గారడీలలో ప్రావీణ్యం సంపాదించాడు. అంతేకాదు చదువులోకూడా అతనిని మించిన వారు ఎవరూలేరు. కలకత్తా యూనివర్సిటీ నుండి పట్టభద్రుడయ్యేనాటికి అతను ఎన్నో రంగాలలో విశేష ప్రావీణ్యత సంపాదించాడు. చిన్నప్పటి నుంచి ధ్యానంలో ఎక్కువ సేపు గడిపేవాడు. ఒకసారి ధ్యానంలో ఒక త్రాచుపాము అతనిపై నుండి పాకివెళ్ళింది. అయినా ఆయన ధ్యాన ముద్ర లోనేఉన్నారు. బ్రహ్మసమాజంలో చేరాడు. ఆయన "దేవుడున్నాడా లేడా?" అని ఎంతో మందిని ప్రశ్నించేవాడు. ఎవరైనా "ఉన్నాడు" అంటే 'చూపించగలవా?" అని అడిగేవాడు. ఆయన సందేహాన్ని ఎవరూ తీర్చలేక పోయారు. అప్పుడు ఒక ఇంగ్లీషు ప్రొఫెసరు హేసిల్ (Professor Hastle) ఆయనతో దక్షిణేశ్వరం లో శ్రీరామకృష్ణ అనే ఆయన ఉన్నారని ఆయన తప్పక తన సందేహాన్ని తీరుస్తాడ"ని చెప్పారు. తన దూరపు బంధువు ఒకాయన కూడా తను శ్రీరామకృష్ణను చూశానని చెప్పాడు.



1881 నవంబరు లో ఒకరి ఇంట్లో తాను పాట పాడాడు. అప్పుడు శ్రీరామకృష్ణుల వారు అక్కడ ఉన్నారు. శ్రీరామకృష్ణులవారు అతనిని దగ్గరకు తీసుకొని దక్షిణేశ్వరానికి రమ్మని పిలిచారు. శ్రీ రామకృష్ణుల వారిని చూసిన తరువాత ఆయనను గురించిన ఆలోచనలే వచ్చేవి నరేన్‌కి. సన్నటి ఆకారంతో

గడ్డం పెంచుకొని నలభైఏళ్ళు దాటిన వ్యక్తిని. పసిపిల్లవాడిలా మాట్లాడే ఆయన తీరుని చూసి ప్రభావితుడయ్యాడు. పాటవింటూ 'కాళీ', 'జగజ్జననీ' అంటూ గంతులు వేస్తూ శ్రీరామకృష్ణులు సమాధిలోకి పోవటంచూసి ఆశ్చర్యపోయాడు. పల్లెటూరి యాసతో బెంగాలీ మాట్లాడేవాడు. బ్రహ్మ సమాజంలో కేశవచంద్రసేన్ శ్రీ రామకృష్ణులవారి ప్రశంశకులలో ఒకరు.

ఒకసారి నరేన్ దక్షిణేశ్వర్ శ్రీరామకృష్ణులను దర్శించటానికి వెళ్ళారు. ఆయన మాటలలో "చూడటానికి అతి సామాన్యులవలె ఉన్నారు . అసాధారణత్వం ఏమీ నాకు ఆయనలో కనిపించలేదు. ఆ రోజు నేను రెండు పాటలు పాడాను. ఆయన సమాధిమగ్నులు అయ్యారు." హఠాత్తుగా ఆయన లేచి నా చేయి పుచ్చుకుని ఉత్తరం వైపు ఉన్న వసారాలోకి నన్ను తోడ్కొనిపోయారు. తమ వెనుక తలుపు మూశారు. అక్కడ మేం ఇద్దరం మాత్రమే ఉన్నాం. వ్యక్తిగతంగా ఏదో ఉపదేశిస్తారు అని అనుకున్నాను. కాని ఆశ్చర్యం! నా చేయిపుచ్చుకుని కళ్ళవెంట ఆనందబాష్పాలు ప్రసరిస్తూ వుండగా, చిరపరచితుడైన వ్యక్తి లాగా, ఆప్యాయత ఉట్టిపడే స్వరంతో ఒకింత విలపిస్తూ, నాతో ఇలా అన్నారు. "ఓ ఇంత ఆలస్యంగా వచ్చావా! నన్ను ఇంత సుదీర్ఘకాలం నిరీక్షణలో ఉంచి ఎంత నిర్దయగా వ్యవహరించావు? నా ఆత్మానుభవాన్ని గురించి ఒక యోగ్యుడైన వ్యక్తితో ముచ్చటించాలని ఎంతగా పరితపించానో తెలుసా" మరుక్షణమే చేతులు జోడించి నాతో "ప్రభూ! తాము సనాతన ఋషి అయిన నర నారాయణుని అవతారం అని నాకు తెలుసు. లోకుల దుఃఖాన్ని బాపటానికి ఈలోకంలో మానవునిగా జన్మించారు" అంటూ ఏదేదో చెప్పారు."

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL